# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం -1, అక్టోబర్ - 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## 365 కిలోల గంజాయి పట్టివేత



వివరాలు 4లో..



# సిరిసిల్లలో కాంగ్రెస్‌ని గెలిపిస్తే ఢిల్లీని ఒప్పించి మంత్రిని చేస్తా

- వెయ్యి రోజుల ప్రజాపాలనలో నేత కార్మికుల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు
- గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పాలసీ
- రూ.345.78 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- సిరిసిల్ల బహిరంగ సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సిరిసిల్ల, బలగం టీవీ సెప్టెంబర్-30: రానున్న ఎన్నికలలో సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఢిల్లీ హై కమాండ్ ను ఒప్పించి మంత్రివర్గం లోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా జూనియర్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ జి. మహేష్ బాబాసాహెబ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. సిరిసిల్లలో చేనేత, పవర్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న నేత బజారు నిర్మాణ పనులకు, సిరిసిల్ల, వేములవాడలో రూ.200 కోట్ల చొప్పున నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పనులకు, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులకు, రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్న గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల మిగతా 4లో..

# అమిత్ షా హామీలను నమ్మలేం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 : తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కొచ్చిలోని గ్రాండ్ హయత్‌లో జరుగుతున్న ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో పాల్గొన్న ఆయన పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు. బీజేపీతో బీఆర్ఎస్ ఎలాంటి పొత్తు పెట్టుకోదని కేటీఆర్ స్పష్టం చేశారు. గత 26 ఏళ్లలో బీజేపీతో తమ పార్టీ పొత్తు పెట్టుకోలేదని, 2014, 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసిందని తెలిపారు. భావజాలపరంగా, సైద్ధాంతికంగా బీఆర్ ఎస్ బీజేపీకి వ్యతిరేకమని పేర్కొన్నారు. మిగతా 3లో..

## ఎలాన్ మస్క్, డెల్టా సీఈవో మధ్య మాటల యుద్ధం



హైదరాబాద్, సెప్టెంబర్ 30 : టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్, ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ సీఈవో ఎడ్ బాస్టియన్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌కు బదులుగా అమెజాన్‌కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్రంగా స్పందించారు. స్టార్‌లింక్‌తో కలిసి పనిచేయడానికి తాము ఆసక్తి చూపడం లేదని బాస్టియన్ వ్యాఖ్యానించినట్లు ఓ ఏవియేషన్ రిపోర్టర్ వెల్లడించారు. మస్క్ ప్రతిష్ఠపై బాస్టియన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మస్క్ స్పందించారు. ఎక్స్ వేదికగా మిగతా 3లో..

# జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి
- రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 30 : వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే మిగతా 3లో..

## హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో కొకైన్ పట్టివేత



హైదరాబాద్, సెప్టెంబర్ 30 : హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా కొకైన్ పట్టుబడింది. దోహా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద నుంచి సుమారు రూ.24.5 కోట్ల విలువైన 4.9 కిలోల కొకైన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (DRI) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. DRI హైదరాబాద్ జోనల్ యూనిట్‌కు అందిన సమాచారంతో మంగళవారం మిగతా 3లో..

## పోలీసుల దిగ్బంధనంలో రాజన్న సిరిసిల్ల..



- ఎక్కడికక్కడే బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ 2లో..

## శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం..



హైదరాబాద్, సెప్టెంబర్ 30: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 45 మంది ప్రయాణికులతో శంషాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. విమానం గగనతలానికి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. వారి అనుమతితో విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానం క్షేమంగా ల్యాండ్ అవ్వడంతో అటు ప్రయాణికులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ ఎటువంటి మిగతా 3లో..

## వరుసగా మూడో రోజూ నష్టాల్లో మార్కెట్లు

3లో..

# కేసీఆర్ కట్టినవాటికి రేవంత్ రిబ్బన్లు కట్

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, సెప్టెంబర్ 30 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ఒక 'రిబ్బన్ కటింగ్ సీఎం' అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్మించిన కట్టడాలకే రేవంత్ రెడ్డి రిబ్బన్లు కత్తిరిస్తున్నారని ఆరోపించారు. "కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పి న రేవంత్, ఇప్పుడు ఆయన కట్టిన మిగతా 3లో..

# రష్యా సైన్యంలో చేరొద్దు..

- అది చాలా ప్రమాదకరం
- భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 : రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాద కరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తు న్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ మిగతా 3లో..

## సంగారెడ్డి జిల్లాలో విషాదం.. వృద్ధ దంపతుల ఆత్మహత్య



మిగతా 4లో..

## ట్రంప్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ..

### వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై చర్చలు



3లో..

# పోలీసుల దిగ్బంధనంలో రాజన్న సిరిసిల్ల..

## ఎక్కడికక్కడే బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



హైదరాబాద్-సెప్టెంబర్ 30 :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు భారీగా మోహరించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టుల పరంపర ప్రారంభమైంది. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువజన, విద్యార్థి నేతలు, ఆటోడ్రైవర్ల సంఘాల ప్రతినిధులు, రైతు నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. పలువురిని ఇళ్ల వద్దే అదుపులోకి తీసుకోగా.. మరికొందరిని రాత్రి నుంచే స్టేషన్లకు తీసుకెళ్లారు.సీఎం సభలో ఆరు గ్యారంటీలు, యూత్ డిక్లరేషన్, పెండింగ్ బిల్లులు, యూరియా, విద్యుత్, రైతు సమస్యలు, ఆటోడ్రైవర్ల ఇబ్బందులు, మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలపై ప్రశ్నలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక కాలనీలోనూ పోలీసులు భారీగా నిఘా ఏర్పాటు చేశారు. సభకు ప్లకార్డులతో వెళ్లకుండా కార్మిక నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్రస్థాయి నాయకుల కదలికలపైనా పోలీసులు దృష్టి సారించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను సీఎంకు వివరించేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు యాదవ్ కూడా పోలీసుల చర్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. “సీఎం పర్యటనను అడ్డుకుంటామని ఎక్కడా చెప్పలేదు. అయినా ఉదయం నుంచే అరెస్టు లు ఎందుకు చేస్తున్నారు? మధ్యమానేరు నిర్వాసి తుల సమస్యలను సీఎంకు చెప్పాలనుకుంటున్నాం. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం” అని నాగరాజు యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఇంటి వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేసి హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం సభ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభా ప్రాంగణం వైపు వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. సిరిసిల్ల పట్టణంలో అర్ధరాత్రి నుంచే బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు ఇంటికి పోలీసులు వెళ్లి ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, సీనియర్ నాయకుడు దిద్ది రాజును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిరిసిల్ల కార్మిక కాలనీలో పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. సీఎం సభ సందర్భంగా ఎలాంటి ప్లకార్డులు ప్రదర్శించవద్దని కార్మిక నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. యువజన నాయకులు, విద్యార్థి నాయకులు సభకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.వేములవాడ నియోజకవర్గం లోనూ పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉన్న నాయకులను ముందుగానే స్టేషన్లకు తరలించడం కనిపించింది. తంగళ్లపల్లి మండలంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన నాయకులను తరలించేందుకు పోలీసు వాహనాలు సరిపోకపోవడంతో టాటా ఏస్ వాహనాలను కూడా వినియోగించారు. మండలంలోని పలువురు నాయకులను రెండు బృందాలుగా విడదీసి తంగళ్లపల్లి, ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తంగళ్లపల్లి మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యను కూడా పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.



## లంచం తీసుకుంటూ ఏసీబికి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్

మొయినాబాద్-సెప్టెంబర్ 30



మొయినాబాద్‌మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. లంచం డిమాండ్ చేసి స్వీకరించిన కేసులో టౌన్ ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్‌నుఏసీబీఅధికారులు పట్టుకున్నారు.ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న గుండు వాణి (AO-1) ఓ నిర్మాణానికి సంబంధించి ఫిర్యాదుదారుడిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా, ఆ నిర్మాణాన్ని అక్రమంగా పరిగణించకుండా అధికారిక సహాయం చేయడానికి రూ.75,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ మొత్తాన్ని మొయినాబాద్ గ్రామపంచాయతీ మాజీ పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం మొయినాబాద్ మున్సిపాలిటీలో డిప్యూటేషన్‌పై సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఏలమోని సుదర్శన్ (AO-2) ద్వారా స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది.2026 సెప్టెంబర్ 30న ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి లంచం డిమాండ్ చేసి, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ ద్వారా రూ.75 వేల నగదును స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఆ లంచం మొత్తాన్ని సుదర్శన్ వద్ద నుంచి అతని చూపిన మేరకు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఇద్దరు అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించకుండా, అనుచిత ప్రయోజనం పొందేందుకు అవినీతికి పాల్పడినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఏసీబీ కేసులో నిందితులైన AO-1 గుండు వాణి, AO-2 ఏలమోని సుదర్శన్‌లను నాంపల్లిలోని SPE & ACB కేసుల కోసం గౌరవ I అదనపు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించలేదు.

- **లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు ఏసీబీని సంప్రదించవచ్చని తెలిపారు. ఏసీబీ తెలంగాణను వాట్సాప్: 9440446106, ఫేస్‌బుక్‌లో Telangana ACB, ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో @Telangana ACB ద్వారా కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ ప్రదేశాల్లో ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారు లేదా బాధితుడి పేరు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

## ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం ఒక్క తెలంగాణనే : హరీశ్ రావు

హైదరాబాద్-సెప్టెంబర్ 30



సెక్రటేరియట్‌లో మా రిటైర్డ్ ఉద్యోగులు పోయి ధర్నా చేస్తున్నరు. మేం దాచుకున్న పైసలు మావి మాకియ్యమంటే 15 శాతం కమీషన్ అడుగుతున్నరని చెబుతున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.ఈ విషయమై హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎన్ని రోజులు ఈ సెక్రటేరియట్ చుట్టూ తిరగాలని ఫైనాన్స్ మినిస్టర్ ఛాంబర్ ముందు నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పోయి ధర్నాలు చేసే పరిస్థితి ఉంది. ఇవాళ రిటైర్డ్ ఉద్యోగులు డబ్బులు రావడం లేదు. వాళ్లు దాచుకున్న జీపీఎఫ్ పైసలు రావడం లేదు. డీఏలు, పీఆర్సీలు రావడం లేదు. నేడు యావత్ ఉపాధ్యాయ, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు.మీరు కలిసినప్పుడు, తిరిగినప్పుడు రిటైర్డ్ ఉద్యోగులను తప్పకుండా కలవండి. ఉపాధ్యాయులకు రేవంత్ రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని గుర్తు చేయండి. నా దృష్టిలో ఒక్కొక్క ఉపాధ్యాయుడు, ఒక్కో ఉద్యోగి వాళ్ల ఓట్లు కాదు.. పది పది ఓట్లు బీఆర్ఎస్ వేయించడానికి తయారుగా ఉన్నారు వాళ్లు. ఎందుకంటే ఇయ్యాళ్ల మోసం చేసిర్రు.. భారతదేశంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రమేదన్నా ఉన్నదా అంటే.. అది ఒక్క తెలంగాణనే. నాలుగేండ్లయినా పీఆర్సీ రాని పరిస్థితి ఉందంటే..? అది ఒక రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనేనన్నారు హరీశ్ రావు.గత సెక్రటేరియట్ చరిత్రలో ఎప్పుడూ కూడా ఇట్లా ఉద్యోగస్తులు పోయి ఫైనాన్సియల్ మినిస్టర్ చాంబర్ ముందు ధర్నా చేసిన చరిత్ర ఈ రాష్ట్రానికి లేదు. అది ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణ రాష్ట్రంలోనైనా మా బిల్లులు మాకియ్యండి. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బకాయిలు ఇవ్వండి.. మా జీపీఎఫ్ పైసలియ్యండి.. అంటూ ఫైనాన్స్ మినిస్టర్ చాంబర్ ముందే ధర్నా చేస్తే ఈ రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క సిగ్గుతో తలదించుకోవాలి.. అని హరీశ్ రావు అన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యత



కామారెడ్డి-సెప్టెంబర్ 30

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు.ఇచ్చిన మాట ప్రకారం..షబ్బీర్ అలీ 15 రోజుల క్రితం కళాశాలకు వచ్చినప్పుడు కళాశాలకు వెళ్లే దారికి రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులు జరుగుతుండటంతో బుధవారం పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ 1,100 మంది అడ్మిషన్లతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కళాశాలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తామన్నారు. హాస్టళ్లలో కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచామని, యూనిఫామ్స్, షూస్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కౌన్సిలర్లు హర్షిత, వనిత పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ సహజమే..: సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ సిటీ-సెప్టెంబర్ :

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ సహజమేనని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీస్ శాఖలో పదవీవిరమణ పొందిన సిబ్బందిని సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు.మాక్లూర్ ఏఎస్సై లక్ష్మణ్ 36ఏళ్ల పాటు పోలీస్‌శాఖలో విధులు నిర్వహించి పదవీవిరమణ చేశారు. సీపీ మాట్లా డుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అయినప్పటికీ ఎలాంటి రిమార్కు లేకుండా లక్ష్మణ్ పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందన్నారు. పదవీ విరమణ అనంతరం సైతం పోలీస్‌శాఖ ఎల్లవేళలా మద్దతుగా ఉంటుందని సీపీ తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యాషియా బేగం, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, జగతి, వనమాల, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (అడ్మిన్/వెల్ఫేర్) ధరణి కుమార్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్-సెప్టెంబర్ 30 :



సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సింగరేణిని అవినీతి మయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి కింగ్ పిన్‌గా అవినీతి జరుగుతోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో లక్షా 80 వేల కోట్లు తక్కువగా ఇస్తున్నారు.సింగరేణి డబ్బులను సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ సోకులకు ఖర్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లెటర్ రాశారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతాన్ని ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు డిప్యూటీ సీఎం భట్టి, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణి సంస్థను ఎవరికైనా అమ్మితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 5 వ తేదీన తెలంగాణ భవన్ లో సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జిలు, కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ మీటింగ్ ఉంటుందన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. రేవంత్ రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. సిరిసిల్లకు రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి సిరిసిల్లకు టూరిస్ట్ లాంటి వారు. నాయకులను ఓడగొట్టడం, గెలిపించడం ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చుట్టూ రేవంత్ రెడ్డి రాజకీయం తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు 45 టీఎంసీలు ఇవ్వొద్దని సీడబ్ల్యూసీకి చంద్రబాబు లేఖలు రాస్తున్నారు. నాన్ బేసిన్ కుప్పంకు కృష్ణా నది నీళ్లను తరలించారు.గురువు కండ్లలో ఆనందం కోసం రేవంత్ రెడ్డి తెలంగాణను ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ మొలకెత్తదన్నారు.

## ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్-సెప్టెంబర్ 30 :

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం అని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ జురాస్ట్రియల్ క్లబ్‌లో బీఆర్ఎస్ పార్టీ సర్వ సభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సనత్ నగర్ నియోజకవర్గంలో దాదాపు 10 వేలకు పైగా గ్రాడ్యుయేట్ ఓట్లు ఉంటాయి. ఒక్క గ్రాడ్యుయేట్‌ను కూడా మర్చిపోకుండా ఓటరుగా నమోదు చేయించాలన్నారు. రెండు గ్రాడ్యుయేట్, ఖైరతాబాద్ ఉప ఎన్నికల పని ఉంటది. 30 రోజుల కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు నమోదు కార్యక్రమం చేయించాలన్నారు. రెండు గ్రాడ్యుయేట్ లపై మనం ఫోకస్ పెట్టాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు.హామీలు, సమస్యలపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ రెండు ఎమ్మెల్సీలు ఓసీలకు ఇచ్చారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలలో అర్హులు లేరా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామనే భయంతో బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రిని ఏమైనా అడుగుతాం అంటే బూతులతో రెచ్చిపోతారు. అసెంబ్లీలో హరీశ్ రావు ఆడుకుంటారు అని సభ ను నడుపవద్దు అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ లు, డివిజన్ అధ్యక్షులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## గందరగోళంగా డబుల్ బెడ్‌రూమ్ లక్కీ డ్రా

హైదరాబాద్-సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలో నిర్వహించిన రెండో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వివాదాస్పదమైంది. లక్కీడ్రా నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంలో అధికారులు డ్రా కార్యక్రమాన్ని నిలిపివేశారు.ప్రజాపాలన, గ్రామసభల్లో సమర్పించిన దరఖాస్తుల రిజిస్టర్లు కనిపించకుండా పోవడంపై బుధవారం నిర్వహించిన సభలో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్కీ డ్రాను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేయడంతో అధికారులు సభను దాదాపు నాలుగు గంటల పాటు నిలిపివేశారు. అనర్హుల జాబితా, ఆన్‌లైన్ నంబర్ల కేటాయింపులో తీవ్ర వ్యత్యాసాలున్నాయని స్థానికులు నిలదీశారు. ఎలాంటి ఆన్‌లైన్ నంబర్లు లేకుండానే సీరియల్ నంబర్లు ఇవ్వడం,అర్హులకు ఇంటి నంబర్లు చూపకపోవడం పై అధికారులను ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో పేర్లు చేర్చేందుకు కొందరు బ్రోకర్లు, అధికారులు రూ. 5,000 నుండి రూ. 10,000 వరకు లంచాలు తీసుకున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. అర్హులైన పేదలను వదిలేసి, సంపన్న వర్గాలు, భూములు ఉన్నవారికే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. అన్ని రకాల రసీదులు, మెసేజ్‌లు ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాలో లేవని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

- **అధికారుల సమన్వయ లోపం..**

ఒకేరోజు ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో, 11 గంటలకు రైతు వేదికలో వేర్వేరుగా సభలు ఏర్పాటు చేయడం కలకలం



రేపింది. అధికార పార్టీ జాబితాలో అక్రమాలు ఉన్నాయంటూ ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో లక్కీ డ్రా వాయిదా పడింది. ఎంపీడీవో స్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు జరిగిన ఈ అవినీతిపై సబ్‌కలెక్టర్ స్థాయి అధికారితో విచారణ జరిపించాలని జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ నాయకులు ప్రదీప్ కుమార్, నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 25న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ గందరగోళంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల సునీల్ కుమార్‌కు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తు త జాబితాను రద్దు చేసి, గ్రామ నియోజక వర్గంలో ని అన్ని కులాల పెద్దల సమక్షంలో పారదర్శకం గా లబ్ధిదారులను ఎంపిక చేయాలనికోరారు.

## సిరిసిల్ల జిల్లాలో భూముల అవకతవకలపై సందీప్ కుమార్ ఝా సమీక్ష

రాజన్న సిరిసిల్ల జిల్లా సెప్టెంబర్ 30,

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిరిసిల్ల జిల్లాలో భూముల అవకతవకలపై కమిటీ సభ్యుడు జనగామ జిల్లా కలెక్టర్, సిరిసిల్ల జిల్లా రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీవో నెంబర్ 134 ప్రకారం భూముల పై నియమించిన కమిటీ సభ్యుడు, సిరిసిల్ల కలెక్టర్, జిల్లాలోని తాసిల్దార్లతో సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూములపై సమీక్షించి, భూముల అవకతవకలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డికి వొడితల ప్రణవ్ ఘన స్వాగతం

కరీంనగర్ నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సందడి

హుజురాబాద్ సెప్టెంబర్ 30



కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఘన స్వాగతం పలికారు.సీఎంతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రాష్ట్ర మంత్రులకు సైతం ఆయన సాదర స్వాగతం పలికారు. హెలీప్యాడ్/కార్యక్రమ ప్రాంగణం వద్ద సీఎంకు పుష్పగుచ్ఛం అందించి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కనీస వేతనాల జీవోను వెంటనే అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కనీస వేతనాలు జీవోను అమలు చేయాలని టీయూసీఐ నాయకులు డిమాండ్



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కనీస వేతనాలు జీవో నంబర్.6ను అమలు చేయాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహిచారు.మూడు కేటగిరీలుగా వేతనాలు ప్రకటించి..టీయుసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరేందర్, ఎం.సుధాకర్‌లు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మూడు కేటగిరీలుగా కనీస వేతనాలను ప్రకటించారన్నారు. దీంట్లో భాగంగానే ప్రభుత్వం జూన్ 1న గెజిట్ విడుదల చేసిందన్నారు. కోటిమంది కార్మికులు ఈ జీవో ద్వారా లబ్ధి పొందుతారని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ఆచరణలో ఇది అమలు కావడం లేదని ఆరోపించారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్, మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆశ, అంగన్‌వాడీల్లో ఇప్పటికీ ఈ జీవో అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.వాస్తవానికి పెరుగుతున్న ధరలకు ఇస్తున్న వేతనాలకు పొంతనలేదని, జీవో 6 ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు కూడా సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, సహాయ కార్యదర్శిలు బి.మల్లేష్, డి.కిషన్ కోశాధికారి సాయరెడ్డి, జిల్లా నాయకులు మురళి, రాజేశ్వర్, రవి, లింగం, తారాచంద్, సుమలత, రాధా, సుమ, పద్మ, లింగం, గంగాధర్, రాజన్న, ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రాగన్ తో చర్చలు సఫలీకృతం అయ్యేనా!?

## సంపాదకీయం

భారత్ తో డ్రాగన్ మళ్లీ కలిసేందుకు సిద్ధమైంది. గత విద్వేషాలకు స్వస్తి పలుకుతూ భారత్ తో సుస్థిర బంధం ఏర్పరుచుకోవడానికి చైనా తహతహ లాడుతోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్, తదనంతర పరిణామాలతో భారత్ విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేసింది. దీంతో పాకిస్తాన్ మీదుగా వెళ్లాల్సిన భారత విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గత ఏడాది కాలంగా ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడిపేందుకు అనుమతివ్వాలని డ్రాగన్ ను కోరుతోంది.అయితే ఇన్నాళ్లూ భారత్ చేసిన ఈ ప్రతిపాదనపై చైనా స్పందించడం లేదు. కానీ తాజాగా బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్‌లో పర్యటించినప్పుడు.. ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైనా అధికారులతో భారత అధికారులు చర్చలు జరుపుతున్నారు. భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జియాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపుతోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందని వారు స్పష్టం చేశారు. జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్ జౌ-న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి, భారత్-చైనా సరిహద్దు వెంబడి నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నంలో ఇదొక భాగం. భారత్-చైనా మధ్య పునఃప్రారంభించిన తొలి భారతీయ విమానయాన సంస్థ ఇండిగో. గత అక్టోబర్‌లో కోల్‌కతా-గ్వాంగ్‌జౌ మధ్య ఇండిగో సర్వీసులను పునఃప్రారంభించింది. నవంబర్‌లో ఢిల్లీ-గ్వాంగ్‌జౌ మధ్య కూడా భారత్-చైనా ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 1న ఢిల్లీ-షాంఘై సర్వీసులను నడిపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చైనా మీదుగా ఇతర దేశాలకు వెళ్లేందుకు భారత్ అనుమతులు కోరుతోంది. మరోవైపు భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని అన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నాయా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్- చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగినప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు. మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనుకూలమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవడానికి నేను ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. మన మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన లేదా క్షీణత అనేది వాస్తవానికి మనలో ఎవరికీ ప్రయోజనం చేకూర్చదు. పైగా దీనివల్ల మూడో పక్షాలే లాభపడతాయి. ఇదే విషయాన్ని భారత్? చాలా కాలంగా చైనాకు చెబుతోంది. అలాగే, 'ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సమస్యలో మనం చిక్కుకుపోకూడదు' అనే అత్యంత ప్రాథమిక దౌత్య సూత్రాన్ని కూడా మేము నిలకడగా పాటించాం. ఏ కారణం చేతనో, చైనా పక్షం దీనిని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. అయితే, ఆ సుదీర్ఘ ప్రతిష్టంభన మన ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడలేదని నా అభిప్రాయం. అది వారికి కూడా ఏ విధంగానూ మేలు చేయలేదు. మన సంబంధాల్లో మెరుగుదల అనేది కేవలం చైనాతోనే కాకుండా, ప్రపంచ దేశాలతో మనకున్న సంబంధాల్లోనూ మన స్థానాన్ని బలోపేతం చేస్తుందని నేను భావిస్తున్నాను." అని జైశంకర్? అన్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే బ్రిక్స్ ( సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి.

## సంగారెడ్డి జిల్లాలో విషాదం..



### వృద్ధ దంపతుల ఆత్మహత్య

నారాయణఖేడ్, సెప్టెంబర్ 30: కొడుకులు పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో వృద్ధ దంపతులు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన నర్సారెడ్డి (85), అంజమ్మ (82) దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరు హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా, మరో ఇద్దరు గ్రామంలోనే ఉంటున్నారు. గ్రామంలో ఉంటున్న ఇద్దరు కుమారులు తమను పట్టించుకోవడం లేదని, ఇంటి నుంచి వెళ్లగొట్టడంతో కొంతకాలంగా అద్దె ఇంట్లో నివసిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.హైదరాబాద్‌లో నివసిస్తున్న కుమారుడు కిష్టారెడ్డి వృద్ధ దంపతుల పోషణ చూసుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, దంపతుల పేర ఉన్న వ్యవసాయ భూమిని మొదటి, మూడో కుమారుల పిల్లలకు రాసిచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నర్సారెడ్డి, అంజమ్మ తమ వ్యవసాయ భూమిలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం ఉదయం బావిలో మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సీఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భారీ బహిరంగ సభలో ఊహించని దృశ్యాలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుండగా వెళ్లిపోయిన ప్రజలు
- ముఖ్యమంత్రి ప్రసంగం మొదలు కాగానే వెళ్ళిపోయిన ప్రజలు

రాజన్న సిరిసిల్ల జిల్లా బలగం టీవీ

స్థానిక నాయకులు సభకు జనాలను భారీగానే సమీకరించినప్పటికీ, సీఎం ప్రసంగం ప్రారంభమవ్వగానే జనాలు కుర్చీల నుంచి లేచి బయటకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. సీఎం ప్రసంగానికి స్పందన కరువవ్వడంతో పాటు జనం సభ నుంచి నిష్క్రమించడం.. తీవ్ర చర్చకు దారితీసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభలో ఊహించని పరిణామాలు కనిపించాయి. నేతలు శ్రమించి జనాలను మైదానానికి తీసుకువచ్చినప్పటికీ... సీఎం మైక్ పట్టుకోగానే సీన్ రివర్స్ అయింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం ప్రారంభించిన కొద్దిసేపటికే జనాలు సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లడం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.





సిరిసిల్లలో పట్టు సాధించేందుకు అధికార పక్షం ఈ సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. స్థానిక నాయకులు వాహనాలు ఏర్పాటు చేసి, జనాలను భారీగానే తరలించారు. అయితే సభ ఆలస్యం కావడం, తీరా సీఎం ప్రసంగం మొదలయ్యాక స్థానిక సమస్యలపై ఆశించిన ప్రకటనలు రాకపోవడంతో జనం నిరాశ చెందినట్లు కనిపిస్తోంది. దీంతో సీఎం మాట్లాడుతున్న సమయంలోనే జనాలు ఒక్కొక్కరుగా వేదిక ప్రాంగణం నుంచి నిష్క్రమించారు.ప్రసంగం సాగుతున్న కొద్దీ వెనుక వరసల్లో ఉన్న కుర్చీలు ఖాళీగా మారిపోయాయి. సాధారణంగా సీఎం రేవంత్ రెడ్డి మార్క్ ప్రసంగాలకు లభించే హర్షధ్వానాలు, కేరింతలు ఇక్కడ కరువయ్యాయి. బయటకు వెళ్తున్న జనాలను ఆపేందుకు స్థానిక నేతలు, కార్యకర్తలు తీవ్రంగా యత్నించినప్పటికీ జనం ఏమాత్రం ఆగలేదు. సభను విజయవంతం చేశామని చెప్పుకోవాలని భావించిన కాంగ్రెస్ నాయకులకు, ఈ రీతిలో జనం మధ్యలోనే వెళ్లిపోవడం కోలుకోలేని షాక్ ఇచ్చిందనే చెప్పాలి.సభకు జనం రావడం ఒక ఎత్తయితే... సీఎం ప్రసంగం సమయంలోనే ఇలా బయటకు వెళ్లిపోవడం, ప్రసంగానికి స్పందన కరువవ్వడం ఇప్పుడు రాజకీయంగా వేడి రాజేస్తోంది. జనాల నిష్క్రమణపై కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి సమీక్ష జరుపుతుందో వేచి చూడాలి.

# హరీశ్ రావును కలిసిన నటుడు ప్రియదర్శి





హైదరాబాద్, సెప్టెంబర్ 30 : నటుడు ప్రియదర్శి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విడుదలైన 'ది ప్యారడైజ్' సినిమాలో తాను పోషించిన శంకరన్న పాత్రతో పాటు తన సినీ ప్రయాణం, భవిష్యత్ ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు.ఈ సందర్భంగా 'ది ప్యారడైజ్' సినిమాలో ప్రియదర్శి నటనను హరీశ్ రావు ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమం, ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం జరిగిన పోరాటాల స్ఫూర్తిని సినిమాలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావవంతంగా చూపించారని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్రలో ప్రియదర్శి కనిపించిన తీరును ప్రత్యేకంగా అభినందించారు. కేసీఆర్ హావభావాలు, నడక, మాటతీరును తెరపై సహజంగా ఆవిష్కరించడం సులభం కాదని, అయితే ప్రియదర్శి ఆ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారని హరీశ్ రావు పేర్కొన్నారు. 'మల్లేశం', 'బలగం' వంటి సినిమాల్లో తెలంగాణ యాస, పల్లె జీవితం, సంస్కృతి, కుటుంబ బంధాలను తన నటన ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేశారని ప్రియదర్శిని అభినందించారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో నటుడిగా ఎదిగిన ఆయన ప్రయాణం తెలంగాణకు గర్వకారణమని అన్నారు.భవిష్యత్‌లో తెలం గాణ నేటివిటీ, పల్లె కథలకు దగ్గరగా ఉండే మరిన్ని మంచి పాత్రలు చేయాలని హరీశ్ రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రియదర్శి హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సినిమా, తెలంగాణ సంస్కృతి, భవిష్యత్ ప్రాజెక్టులపై ఇద్దరి మధ్య ఆత్మీయ చర్చ జరిగినట్లు సమాచారం.

## రూ.1.82 కోట్ల విలువైన గంజాయి 365 కిలోల గంజాయి పట్టివేత

### 365 కిలోల గంజాయి స్వాధీనం..

### లారీ, కారు, బైక్ సీజ్.. పలువురు అదుపులోకి

భద్రాచలం: ఒడిశా నుంచి మహారాష్ట్రకు మూడు వాహనాల్లో తరలిస్తున్న భారీ మొత్తంలో గంజాయిని భద్రాచలం డీటీఎఫ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా పట్టుకున్నాయి. మొత్తం 365.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు, దాని విలువ సుమారు రూ.1.82 కోట్లు ఉంటుందని ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో డీటీఎఫ్ కొత్తగూడెం బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా తొలుత బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద 9 కిలోల గంజాయి లభించడంతో బైక్‌ను సీజ్ చేసి, ఒడిశాకు చెందిన లిలిదివాకర్ మండల్ (22)లిలిను అదుపులోకి తీసుకున్నారు.అదే సమయంలో బైక్ వెనుక వస్తున్న హ్యుందాయ్ కారుపై అనుమానం రావడంతో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. కారులో 100 కిలోల గంజాయి గుర్తించారు. దీంతో ఒడిశాకు చెందిన ఎలక్ట్రిషియన్ లిలిసుమన్ పాల్ (22)లిలిను అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేశారు.బైక్, కారులో పట్టుబడిన వ్యక్తులను విచారించగా మరో లారీలో కూడా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో కరుణగిరి ప్రాంతంలోనిలిపి ఉంచినలారీనితనిఖీ చేయగా అందులో 263.2 కిలోల గంజాయి బయటపడింది.లారీలో ఉన్న లిలిరాజశేఖర్ మార్గి (22), క్లీనర్ బ్రిజన్ నాసా (20)లిలిలను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ కూడా ఒడిశాకు చెందినవారిగా గుర్తించారు. లారీ కూడా ఒడిశా ప్రాంతానికి చెందినదిగా అధికారులు తెలిపారు.ఈ మొత్తం ఆపరేషన్‌లో కొత్తగూడెం డీటీఎఫ్ సీఐ రమాదేవి, సీఐలు కిష్టయ్య, నరేందర్ రెడ్డి, ఎస్ఐలు సలీముల్లా ఖాన్, శ్రీధర్ రావుతో పాటు సిబ్బంది కరీం, మౌలాంకర్, వీరబాబు, శ్రీనివాస్, నర్సింహరావు, రమేష్, పార్థసారథి, విల్సన్, సీతారాం, వీరభద్రం, రాకేష్, కిరణ్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.భారీగా గంజాయిని పట్టుకున్నఖమ్మం జిల్లా ఎక్సైజ్ బృందాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవి నాష్ మహంతి, ఎన్‌ఫోర్స్‌మెంట్‌జాయింట్‌కమిషనర్ అంజన్‌రావు, ఖమ్మండిప్యూటీ సోమిరెడ్డి అభినందించా రు. గంజాయి అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్‌ని గెలిపిస్తే ఢిల్లీని ఒప్పించి మంత్రిని చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు.పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని, వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్‌ను, వేములవాడ, సిరిసిల్లలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవచింతనతో పాటు, తమ పూర్వీకులు నిజాం రజాకార్లపై చేసిన వీరోచిత పోరాటానికి సిరిసిల్ల ప్రజలు వారసులని పేర్కొన్నారు.సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని, అయితే పదేళ్ల టీఆర్ఎస్ హయాంలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందని అన్నారు. మనిషి నాగరికతకు మొదటి అడుగు వస్త్రమని, వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా సిరిసిల్ల అని పేర్కొన్నారు. వేలాది కుటుంబాలు వస్త్ర పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చీరలు, అగ్గిపెట్టెలో పెట్టగలిగేంత సన్నని చీరలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి చేనేత కార్మికుల సొంతమని అన్నారు.2009 నుంచి 2023 వరకు అరడజను సార్లు జరిగిన ఎన్నికల్లో కేటీఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదని, కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదని ప్రజలు ఆలోచించాలని అన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు కనీసం వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాలేని పరిస్థితి గత పాలనలో ఉండేదని అన్నారు.గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ రూపొందించాలని స్థానిక నాయకులు కోరగా, విదేశాల్లో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడంతో పాటు సంబంధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు.2004, 2006, 2008 సంవత్సరాల్లో మూడుసార్లు కరీంనగర్ జిల్లా ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించినప్పటికీ 2009లో కేసీఆర్ పాలమూరుకు వలస వెళ్లారని అన్నారు. గత పాలకులపై అవినీతి ఆరోపణలు చేస్తూ, కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. అమెరికాలో ఎన్ని బాత్రూంలు కడిగారో, వేల కోట్లు ఎలా సంపాదించారో కేటీఆర్ వెల్లడించాలని అన్నారు.గోదావరి



జలాలను అడ్డం పెట్టుకుని మానేరు ఇసుకను దోచుకున్నారని ఆరోపిస్తూ, నేరెళ్ల బాధితులు ఇందుకు సజీవ సాక్ష్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను ఇక్కడికి తీసుకువస్తే పోలీసులు నిర్బంధించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మిడ్‌మానేరు డ్యాం ముంపులో ఇళ్లు కోల్పోయిన కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇళ్ల స్థలాలు పొందలేదా అని ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కేటీఆర్‌కు పచ్చనోట్లుగా మారాయని ఆరోపించారు. వేములవాడ శివయ్య, భద్రాచలం రామయ్యను మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరేనని వ్యాఖ్యానించారు.వెయ్యి రోజుల ప్రజాపాలనలో నేత కార్మికుల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేశామని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని, వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని అన్నారు.ఎమ్మార్వో కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్లలో మార్పు రాబోతోందని, ప్రజల కలలో ఆనందం కనిపిస్తుందని అన్నారు.రాబోయే శాసనమండలి ఎన్నికల్లో ఒక పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

# బంగారం కడుగుతామంటూ ఘరానా మోసం..

**మహిళ మెడలోని పుస్తెలతాడు గుంజుకునే యత్నం**
**బాధితురాలి అప్రమత్తతతో బయటపడిన ఘటన..**
**ఇద్దరిని అదుపులోకి తీసుకున్న గ్రామస్తులు**
**పోలీస్ స్టేషన్‌కు తరలింపు..**
**ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో కలకలం**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

బంగారం కడుగుతామని నమ్మించి మహిళను మోసం చేసి ఆమె మెడలోని పుస్తెలతాడును అపహరించేందుకు ప్రయత్నించిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గ్రామంలో తిరుగుతూ బంగారం శుభ్రం చేస్తామని చెబుతూ మందాటి కవిత వద్దకు వెళ్లినట్లు తెలిసింది.

ఇంటిముందు కవిత బీడీలు చేస్తున్న సమయంలో ఆమెను సంప్రదించిన ఇద్దరు వ్యక్తులు.. తమ వద్ద ఉన్న పదార్థాలతో ఇత్తడి చెంబుపై పౌడర్ చల్లి దానిని తెల్లగా మార్చినట్లు చూపించినట్లు సమాచారం. దీంతో వారు చెప్పిన మాటలను నమ్మేలా చేసి, బంగారం కూడా ఇదే విధంగా శుభ్రం అవుతుందని కవితకు నమ్మకం కలిగించినట్లు తెలుస్తోంది.



**పౌడర్ వాసనతో అప్రమత్తత కోల్పోయిన మహిళ?**

ఇత్తడి చెంబుపై పౌడర్ ప్రయోగించిన అనంతరం వచ్చిన వాసన కారణంగా కవిత కొంతసేపు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల నర పుస్తెలతాడును తీసుకున్న ఇద్దరు వ్యక్తులు దానిని ఒక ద్రావణంలో వేసినట్లు సమాచారం.

అయితే కొద్దిసేపటికే తేరుకున్న కవిత.. తన పుస్తెలతాడు కనిపించకపోవడంతో జరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే గట్టిగా కేకలు వేసినట్లు తెలుస్తోంది. ఆమె అరుపులు విన్న చుట్టుపక్కల గ్రామస్తులు అక్కడికి చేరుకుని ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారని స్థానికులు తెలిపారు.

**గ్రామస్తుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం**

కవిత అరుపులతో అప్రమత్తమైన గ్రామస్తులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన అనంతరం పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో అక్కపల్లి గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంగారం శుభ్రం చేస్తామంటూ అపరిచిత వ్యక్తులు ఇళ్ల వద్దకు వస్తే అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

**దర్యాప్తులో అసలు విషయం తేలాల్సి ఉంది**

ఈ ఘటనలో బీహార్‌కు చెందిన వారిగా చెబుతున్న ఉస్మాన్, సత్తార్ అనే ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. అయితే వీరు నిజంగా ఏ ఉద్దేశంతో గ్రామానికి వచ్చారు? బంగారం కడుగుతామని చెప్పడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? మహిళకు మత్తు కలిగించే పదార్థం ఏదైనా ఉపయోగించారా? పుస్తెలతాడును ద్రావణంలో ఎందుకు వేశారు? వంటి అంశాలపై పోలీసుల దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది.

ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిందితుల గత కార్యకలాపాలు, వారు మరెక్కడైనా ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారా అనే కోణంలోనూ పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అపరిచితులు బంగారం శుభ్రం చేస్తామని, బంగారం పరీక్షిస్తామని లేదా విలువైన వస్తువులకు ప్రత్యేక పౌడర్‌తో మెరుగులు పెడతామని ఇంటి వద్దకు వస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.



# ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యుల కొరత

**30 పడకల ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులతోనే వైద్యం..**
**100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి**

బలగంటీవీ, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్ అన్నారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి రోజుకు సుమారు 200 నుంచి 500 మంది వరకు ఆస్పత్రికి వస్తున్నప్పటికీ సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేవని ఆరోపించారు. మండల బీజేపీ నాయకులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఆయన రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అరకొర వసతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోగులు తెలిపినట్లు చెప్పారు. వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులకు సరైన వైద్యం అందడం లేదని అన్నారు. రోగ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలు, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

30 పడకల ఆస్పత్రికి అవసరమైన వసతులు కల్పించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినప్పటికీ అవి అసంపూర్తిగా ఉండటంతో రోగులకు పూర్తిస్థాయి సదుపాయాలు అందడం లేదని వైద్యులు తెలిపినట్లు బీజేపీ నాయకులు చెప్పారు. ఒకే మంచంపై ఇద్దరు రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి ఉందని, కొన్ని మంచాలకు బెడ్లు లేక ప్లాస్టిక్ కవర్లు వేసి ఉపయోగిస్తున్నారని తెలిపారు. సెలైన్ బాటిళ్లను వేలాడదీసేందుకు స్టాండ్లు లేక కిటికీల ఊచలకు బ్యాండేజ్ క్లాత్‌తో కట్టి చికిత్స అందిస్తున్న పరిస్థితి ఉందని ఆరోపించారు.

ఆస్పత్రిలో పది మందికి పైగా వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ముగ్గురు వైద్యులతోనే సేవలు అందుతున్నాయని, దీంతో ప్రజలకు సకాలంలో వైద్యం అందించడం కష్టంగా మారిందని తెలిపారు. కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మంజూరు చేసి, అన్ని విభాగాలను ఏర్పాటు చేయాలని కిరణ్ నాయక్ డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతోందని విమర్శించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చందుపట్ల లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షుడు గంట బాలకిషన్‌గౌడ్, వార్డు మెంబర్ కొత్త చెన్నయ్య, అంతర్పుల తిరుపతి, పందిర్ల సత్తయ్య, బూత్ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా, చందుపట్ల నాగిరెడ్డి, సంతోష్, ముద్దం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన వేళ బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు





**జిల్లా వ్యాప్తంగా పోలీసుల అదుపులో పలువురు నాయకులు.. హౌస్ అరెస్టులు, స్టేషన్లకు తరలింపు**

బలగంటీవీ,రాజన్న సిరిసిల్ల:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురు నాయకులను అరెస్టు చేయడంతో పాటు మరికొందరిని హౌస్ అరెస్టు చేశారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అదే మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.గంభీరావుపేట మండల కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ నాయకులను తెల్లవారుజామున సుమారు 4 గంటలకే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




ముస్తాబాద్ మండల కేంద్రంలోనూ బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వీర్నపల్లి మండలంలో పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తంగళ్లపల్లి మండలంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మాటల మధును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.ఇదే విధంగా జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అర్ధరాత్రి నుంచే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొందరు నాయకులను ఇళ్ల వద్దే ఉంచగా, మరికొందరిని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.అయితే, తమను ఎలాంటి కారణం లేకుండా ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.





# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులా?

**-బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు**

బలగంటివీ,రాజన్న సిరిసిల్ల:



ప్రభుత్వ విధానాలను, ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం సబబు కాదని మాజీ జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా చీటీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన ప్రతిసారీ అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు.ప్రజల తరఫున గొంతు వినిపించే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా, ఇచ్చిన 420 హామీలను 6 గ్యారంటీలను అమలు పరిచి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు

# ప్లెక్సీల్లో బీసీ నేతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరం

**పార్టీ ప్రతిష్ట దెబ్బతినకముందే అధిష్టానం జోక్యం చేసుకోవాలి**
**. ఎల్ల బాలకృష్ణ**

బలగం టివీ,గంభీరావుపేట:



బీసీ వర్గాలపై అగ్రవర్ణాల కుట్ర జరుగుతోందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం జాయింట్ సెక్రటరీ, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎల్ల బాలకృష్ణ ఓ ప్రకటనలో ఆరోపించారు.ఈ సందర్భంగా ఎల్ల బాలకృష్ణ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్లెక్సీల విషయంలో బీసీ నేతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్లెక్సీల్లో జిల్లా అధ్యక్షుడి ఫొటోకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. శ్రీనివాస్ బీసీ వర్గానికి చెందిన నాయకుడు కావడంతోనే ఆయనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే భావన బీసీ వర్గాల్లో నెలకొందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న బీసీల మద్దతు కాంగ్రెస్‌కు అవసరం లేదా అని ప్రశ్నించారు.అదేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తిరుపతి గౌడ్‌ను పార్టీ అధిష్టానం నిర్ణయించిన అనంతరం కొంతమంది నాయకులు వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సభకు జన సమీకరణ జరుగుతున్న సమయంలోనే మండల కాంగ్రెస్ అధ్యక్షుడితో కొంతమంది నాయకులు వాగ్వాదానికి దిగడం పార్టీ ప్రతిష్టకు మంచిది కాదన్నారు.

అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన నియోజకవర్గ ఇన్‌చార్జి గ్రూపు రాజకీయాలకు అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలం, నియోజకవర్గ స్థాయిలో పార్టీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గానికి నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్న సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు పార్టీకి నష్టం కలిగించే అవకాశం ఉందని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై ఉన్న విశ్వాసం దెబ్బతినకముందే అధిష్టానం జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు.మంగళవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మండలానికి వచ్చిన సమయంలో ఆయన సమక్షంలోనే కాంగ్రెస్‌లోని వర్గ విభేదాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలని, బీసీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

# ముఖ్యమంత్రి సభకు హాజరు కాకుంటే రూ.500 జరిమానా..!

**-మహిళా సంఘాల సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారంటూ ఆరోపణలు..**
**-దుమాల గ్రామంలో వివోఏపై మహిళా సంఘాల సభ్యుల ఆగ్రహం..**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట, దుమాల:

సిరిసిల్లలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని, సభకు హాజరు కాకపోతే రూ.500 జరిమానా విధిస్తామని ఒక గ్రామ సంస్థ సహాయకురాలు (VOA) తమకు సంబంధించిన మహిళా సంఘాల గ్రూపుల్లో చెప్పినట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు.

దుమాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ గ్రామ సంస్థ సహాయకురాలు (VOA) అన్నవేణి భాగ్య తన పరిధిలోని సుమారు 20 మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సభకు తప్పకుండా రావాలని సూచించినట్లు మహిళా సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. ఎవరైనా సభకు హాజరు కాకపోతే సంబంధిత మహిళా స్వయం సహాయక బృందానికి రూ.500 జరిమానా విధిస్తామని గ్రూపుల్లో సమాచారం పంపినట్లు వారు చెబుతున్నారు.

**సభకు రావాలా.. వద్దా అనేది సభ్యుల నిర్ణయమేనా?**

మహిళా స్వయం సహాయక సంఘాలు మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ఏర్పడిన సంస్థలు. తెలంగాణ ప్రభుత్వ SERP వివరాల ప్రకారం SHGలు సభ్యుల స్వీయ ఎంపిక ఆధారంగా ఏర్పడతాయని, వాటి కార్యకలాపాల్లో పొదుపు, రుణాలు, సామాజిక అంశాలపై చర్చలు, సమాజ అభివృద్ధి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

అదే విధంగా గ్రామ సంస్థ (VO) అనేది గ్రామంలోని SHGల సమాఖ్యగా పనిచేస్తుందని, పేదల సమస్యలను వేదికపైకి తీసుకురావడం, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించడం వంటి బాధ్యతలు ఉంటాయని SERP పేర్కొంటోంది.

ఈ నేపథ్యంలో ఒక రాజకీయ సభకు హాజరు కాకపోతే రూ.500 జరిమానా విధిస్తామని చెప్పడం ఏ నిబంధన ఆధారంగా జరిగిందన్న ప్రశ్నలు మహిళా సంఘాల సభ్యుల నుంచి వినిపిస్తున్నాయి.

ఇష్టం ఉంటే వెళ్తారు.. లేకుంటే వెళ్లరు..

“ముఖ్యమంత్రి సభకు వెళ్లాలా? వద్దా? అనేది మా వ్యక్తిగత నిర్ణయం. సభకు రావాలని చెప్పడం ఒక విషయం.. రాకపోతే జరిమానా విధిస్తామని చెప్పడం మరో విషయం. మహిళా సంఘాల పేరుతో ఇలాంటి జరిమానాలు విధించే అధికారం ఎవరికుంది?” అంటూ కొందరు మహిళా సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

మహిళా సంఘాలు తమ పొదుపులు, రుణాలు, ఆర్థిక కార్యకలాపాలతో పాటు సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, వాటి సభ్యులపై ఏదైనా అదనపు ఆర్థిక భారం విధించాలంటే సంబంధిత నిబంధనలు, నిర్ణయ ప్రక్రియ ఏమిటో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**రూ.500 జరిమానాకు ఆధారం ఏమిటి?**

సభకు హాజరు కాకపోతే రూ.500 జరిమానా విధిస్తామని నిజంగా ఆదేశించారా?అలా అయితే ఆ నిర్ణయం ఎవరు తీసుకున్నారు?ఏ సమావేశంలో తీర్మానం చేశారు?

ఏ నిబంధన ప్రకారం జరిమానా విధిస్తున్నారు?




జరిమానా మొత్తాన్ని ఎక్కడ జమ చేస్తారు?దానికి రసీదు ఇస్తారా?

అనే ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రభుత్వ కార్యక్రమాల్లో కనిపిస్తుండగా, హాజరును ప్రోత్సహించడం మరియు హాజరు కాకపోతే జరిమానా విధిస్తామని బెదిరించడం రెండూ ఒకటే కాదని మహిళా సంఘాల సభ్యులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కూడా మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విషయాన్ని అధికారికంగా వెల్లడించింది.

**అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్..**

ఈ వ్యవహారంపై సంబంధిత DRDA/ఇందిరా మహిళా శక్తి అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

జరిమానా విధిస్తామని నిజంగా ఎవరైనా చెప్పి ఉంటే, దానికి అధికారిక ఆధారం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని, అలాంటి నిబంధన లేకపోతే మహిళా సంఘాల సభ్యులపై ఒత్తిడి లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

అయితే ఈ ఆరోపణలపై సంబంధిత VOA అన్నవేణి భాగ్య లేదా సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. వారి వివరణ లభించిన తర్వాతే ఆరోపణలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మహిళా సంఘాల పేరుతో రాజకీయ కార్యక్రమాలకు సభ్యుల హాజరును తప్పనిసరి చేయడం, హాజరు కాకపోతే ఆర్థిక జరిమానా విధిస్తామని చెప్పడం వంటి అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానిక మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

**సభ్యుల స్పందన..**

ముఖ్యమంత్రి సభకు వెళ్లకుంటే 500 రూపాయల ఫైన్ వేస్తామని బెదిరింపులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని.. ఎన్ని బెదిరింపులకు గురిచేసిన తాము మాత్రం ముఖ్యమంత్రి సభకు వెళ్ళమని పలువురు మహిళా గ్రూప్ సభ్యులు అన్నారు.



# సీఎం సిరిసిల్ల పర్యటనలో ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు

**హామీలపై నిలదీస్తారనే భయంతోనే హౌస్ అరెస్టులు:**
**బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

బలగం టివీ,రాజన్న సిరిసిల్ల:

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం, గృహ నిర్బంధాలు విధించడంపై బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైన ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.

తనను హౌస్ అరెస్ట్ చేసిన సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే పోలీసులు ద్వారా బీజేపీ నాయకులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి అణచివేత ధోరణి కనిపించిందని గోపి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల గొంతును అణచివేయడం వల్ల గత ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తే ప్రజల్లో విశ్వాసం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్ దర్శనంపై భక్తుల్లో ఉన్న ఆందోళనకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి తన సిరిసిల్ల పర్యటన సందర్భంగా మూలవిరాట్ దర్శనం పునరుద్ధరణపై స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వస్త్ర పరిశ్రమకు, నేత కార్మికులకు సిరిసిల్ల ప్రధాన కేంద్రంగా ఉన్నందున నూలు డిపోను తిరిగి సిరిసిల్లకు తీసుకురావాలని , నూలు డిపో తరలింపు నిర్ణయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో గతంలో ఇచ్చిన హామీ మేరకు కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను వెంటనే ప్రారంభించాలని .సాగునీటి సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు బీజేపీ భయపడబోదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అరెస్టు చేయకుండా సిరిసిల్లకు రా..

**- అరెస్టులపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం..**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 30న బుధవారం సిరిసిల్లలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అరెస్టులు, నిర్బంధాలు చేపడుతున్నారంటూ ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సభ నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడైనప్పటికీ, ప్రతిపక్ష నాయకులపై పోలీసుల చర్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి

బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ “ముఖ్యమంత్రి సిరిసిల్లకు రావడం కోసం బీఆర్ఎస్ నాయకులను ఎందుకు అరెస్టు చేయాలి? అరెస్టులు, నిర్బంధాలతో ప్రతిపక్షం గొంతును అణచివేయడం సాధ్యం కాదు” అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించే హక్కు ఉందని పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల జిల్లా మొత్తం పోలీసు వలయంగా మారిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎంతమందిని అరెస్టు చేసినా బీఆర్ఎస్ కార్యకర్తలు వెనక్కి తగ్గబోరని, ప్రజా సమస్యలపై ప్రశ్నించడం కొనసాగిస్తామని వారు తెలిపారు. ఇటీవల తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు తీసుకున్న నిర్బంధ, అరెస్టు చర్యలపై రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సిరిసిల్ల సీఎం పర్యటనకు ముందు చోటుచేసుకుంటున్న పరిణామాలు మరింత రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

“బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్ నాయకులకు ఎందుకు అంత భయం? ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలి. అరెస్టులు, నిర్బంధాలు చేసి ప్రశ్నించే గొంతులను ఆపాలని చూస్తే అది సాధ్యం కాదు” అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

“సిరిసిల్లలో ఎగిరేది గులాబీ జెండానే” అంటూ బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. అరెస్టులు, పోలీసు చర్యలు రాజకీయ భేదాభిప్రాయాలను అణచివేసే మార్గం కాకూడదని, ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్యనే తమ రాజకీయ కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

అరెస్టు అయిన వారిలో తిమ్మాపూర్ సర్పంచ్ అందే సుభాష్, గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, బండ లింగంపల్లి సర్పంచ్ నర్సా గౌడ్, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు, దుమాల సర్పంచ్ సోమారపు శరవిందు, బుగ్గ రాజేశ్వర తండా సర్పంచ్ తిరుపతి నాయక్, సీనియర్ నాయకులు గుల్లపల్లి నరసింహారెడ్డి, నమిలికొండ శ్రీనివాస్, పిల్లి కిషన్ యాదవ్, పందిర్ల పరుశురామ్ గౌడ్, రాగట్లపల్లి ఉపసర్పంచ్ రాము యాదవ్, సింగారం దేవరాజు, మాజీ ఎంపిటిసి మధు, ప్రమోద్, సన్నీ, రాజు తదితరులు ఉన్నారు.



# విమానంలో కో-పైలట్ ఉన్మాదం!

బలగం టీవీ, దుబాయ్

గాల్లో ప్రయాణిస్తున్న ఒక ప్యాసింజర్ విమానంలో ఊహించని భయాందోళనకరమైన సంఘటన చోటుచేసుకుంది. దుబాయ్ నుండి ఇజ్రాయెల్‌లోని తెల్ అవీవ్‌కు బయలుదేరిన 'ఫ్లైదుబాయ్' (FZ1073) విమానంలో కో-పైలట్ అకస్మాత్తుగా తీవ్ర ఉన్మాదంతో ప్రవర్తించి, కాక్‌పిట్‌లోనే కెప్టెన్‌పై దాడికి తెగబడ్డాడు. విమానాన్ని వినాశనం చేసేందుకు లేదా క్రాష్ చేసేందుకు సదరు కో-పైలట్ యత్నించినట్లు తెలుస్తోంది. అయితే, సమయస్ఫూర్తితో వ్యవహరించిన తోటి సిబ్బంది, కొందరు ప్రయాణికులు అతడిని గాల్లోనే మందలించి, లొంగదీసుకోవడంతో సుమారు 180 మంది ప్రయాణికులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

30 సెకన్లలో 14 వేల అడుగులు కిందకు జారిన విమానం:

జోర్డాన్ ఆకాశంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. కాక్‌పిట్‌లో ఒక్కసారిగా ఘర్షణ తలెత్తడంతో విమానం కంట్రోల్ తప్పి కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే దాదాపు 14,000 అడుగుల కిందకు పడిపోయింది. దీనితో విమానం ఒక్కసారిగా ఊగిసలాడటం, భయానక వాతావరణం నెలకొనడంతో ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విమానం నుండి ఎమర్జెన్సీ సిగ్నల్స్ విడుదల కావడంతో అప్రమత్తమైన ఇజ్రాయెల్ డిఫెన్స్ దళాలు యుద్ధ విమానాలను కూడా రంగంలోకి దించాయి.

సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్:

కాక్‌పిట్‌లో అలజడిని గమనించిన పలువురు ప్రయాణికులు మరియు డ్యూటీలో లేని విమాన సిబ్బంది చాకచక్యంగా కాక్‌పిట్ లోపలికి ప్రవేశించి దాడికి పాల్పడిన వ్యక్తిని లొంగదీసి కట్టిపడేశారు. అనంతరం విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలోని 'తబుక్' విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. తీవ్ర గాయాలపాలైన పైలట్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించగా, దాడికి పాల్పడిన నిందితుడిని సౌదీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రయాణికులందరినీ ఇతర ప్రత్యామ్నాయ విమానంలో తెల్ అవీవ్‌కు క్షేమంగా చేరవేశారు.



# వియత్నాంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు యోగా శిక్షకులు దుర్మరణం!

బలగం టీవీ రాంచీ:

ఉపాధి కోసం వియత్నాం వెళ్లిన జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు యువ యోగా శిక్షకులు అక్కడ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. రాంచీకి చెందిన రాజా కుమార్ వర్మ (26), జమ్‌షెడ్‌పూర్‌కు చెందిన వినయ్ యాదవ్ (23) వియత్నాంలోని డా లాట్ (Da Lat) నగరంలో బైక్ ప్రమాదానికి గురై మృతి చెందారు. యోగా క్లాసులు ముగించుకుని తిరిగి వస్తుండగా, బురద రోడ్డుపై బైక్ జారి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాజా కుమార్ వర్మ అక్కడికక్కడే కన్నుమూయగా, వినయ్ యాదవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత తుదిశ్వాస విడిచారు.

మృతదేహాల తరలింపునకు రూ. 20 లక్షలు.. దాతల సాయం కోరిన కుటుంబాలు:

కుటుంబాలను పోషించుకునేందుకు రెండేళ్ల క్రితమే వీరు వియత్నాం వెళ్లారు. వారి మృతదేహాలను తిరిగి భారత్‌కు తీసుకురావడానికి దాదాపు రూ. 20 లక్షలు ఖర్చవుతుందని, అంతటి ఆర్థిక తోడ్పాటు తమ వద్ద లేదని మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ క్రమంలో రాజా కుమార్ వర్మ తల్లి రూపా వర్మ, సోదరుడు శుభం వర్మ రాజ్యసభ ఎంపీ మహువా మాజీని కలిసి తమ బాధను విన్నవించారు. స్పందించిన ప్రజాప్రతినిధులు రాంచీ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ భజంత్రీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు.

ప్రభుత్వం పూర్తి సాయం అందిస్తుంది

జార్ఖండ్ మంత్రి ఈ విచారకర సంఘటనపై జార్ఖండ్ కార్మిక శాఖ మంత్రి సంజయ్ ప్రసాద్ యాదవ్ స్పందించారు. ప్రమాదంలో మరణించిన ఇద్దరి మృతదేహాలను రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతోనే జార్ఖండ్‌కు సురక్షితంగా తీసుకొస్తామని మీడియాకు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల పరిహారాలు, సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. విదేశాల్లో పనిచేస్తూ మరణించిన వలస కార్మికుల సంక్షేమ పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సిరిసిల్లకు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ, సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి తొలి అడుగు పడిందని, రెండో అడుగు సిద్దిపేటలో, మూడో అడుగు గజ్వేల్‌లో పడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

గత పాలకులు పెండింగ్‌లో పెట్టిన మల్కపేట రిజర్వాయర్ కాలువ భూసేకరణ పనులకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయానికి గత పాలకులు ఏటా రూ.100 కోట్లు ఇస్తామని చెప్పి మోసం చేయగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.250 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు.

గత ప్రభుత్వం నేతన్నలకు పెండింగ్‌లో ఉంచిన రూ.375 కోట్ల బకాయిలను చెల్లించడంతోపాటు, గత ఏడాది 6.90 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు చేతినిండా పని కల్పించామని తెలిపారు. ముంపు గ్రామాల బాధితులకు పెండింగ్‌లో ఉన్న రూ.35 కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేశారని పేర్కొన్నారు.

ఇప్పటికే 4,600కు పైగా కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని, మరో 6 వేల కుటుంబాలు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. వారికి కూడా ముఖ్యమంత్రి త్వరలోనే నిధులు మంజూరు చేస్తారని చెప్పారు.

సిరిసిల్ల నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు, కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీలు 9, 10, 11, 12 కింద కాలువల నిర్మాణానికి భూసేకరణ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



# సిరిసిల్లకు సీఎం రేవంత్ రెడ్డి..



# ఇరాన్ లొంగిపోక తప్పదు

## హర్మూజ్ జలసంధి సంక్షోభం: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు.. తీవ్రంగా ప్రతిస్పందించిన ఇరాన్!

బలగం టీవీ, వాషింగ్టన్/టెహ్రాన్:



పశ్చిమాసియా యుద్ధ మేఘాల నడుమ హర్మూజ్ జలసంధి (Strait of Hormuz), ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ టెక్ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లతో భేటీ అనంతరం వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ చివరికి తమ ఎదుట లొంగిపోక తప్పదని పేర్కొన్నారు. గత రెండు రోజుల్లో చరిత్రలో ఎన్నడూ లేనంతగా హర్మూజ్ జలసంధి గుండా అమెరికా ఎక్కువ మొత్తంలో చమురును వెలికితీసి రవాణా చేసిందని ఆయన ఆరోపించారు.

ట్రంప్ వ్యాఖ్యలు భ్రమపూరితం: ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ తీవ్ర హెచ్చరిక

ట్రంప్ చేసిన ప్రకటనలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ తీవ్రంగా మండిపడ్డారు. ట్రంప్ వ్యాఖ్యలు కేవలం పాత వాదనల పునరావృతమేనని, అవి భ్రమల్లో చేసిన ప్రకటనలని తోసిపుచ్చారు. హర్మూజ్‌లో భద్రతను చమురు రవాణాతో ముడిపెట్టవద్దని హెచ్చరించిన ఆయన, "ఇరాన్ తన భద్రతకు ఏమాత్రం భంగం కలగనివ్వదు. మేము చమురు అమ్మలేని పరిస్థితి వస్తే, ఈ ప్రాంతంలో మరెవరూ కూడా చమురును అమ్మలేరు" అని స్పష్టం చేశారు. తమ భద్రతకు హామీ లేకపోతే పశ్చిమాసియాలోని ఏ ఒక్క మౌలిక సదుపాయం కూడా సురక్షితంగా ఉండదని అమెరికా, దాని మిత్రదేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

అమెరికా స్పందన కోసం వేచి చూస్తున్నాం: ఇరాన్ విదేశాంగ మంత్రి

ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తుల ద్వారా న్యూయార్క్‌లో అమెరికాతో ఇరాన్ మరోసారి పరోక్ష సంప్రదింపులు జరిపిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించడంపై తాము అందించిన 7 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి అమెరికా అధికారిక స్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షల తీవ్రత.. ట్రంప్ క్లారిటీ

పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వేళ అమెరికా ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షల ముమ్మరాన్ని పెంచింది. ఇరాన్ సైన్యానికి ఆయుధ సేకరణలో సహకరిస్తున్నాయనే ఆరోపణలతో ఇరాన్, హాంకాంగ్, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న 10 సంస్థలు, వ్యక్తులపై కఠిన ఆంక్షలు విధించింది. అయితే ఇరాన్‌పై ఆంక్షలు సడలిస్తున్నట్లు లేదా నిలిపివేసిన నిధులను విడుదల చేస్తున్నట్లు వస్తున్న వార్తలను అధ్యక్షుడు ట్రంప్ 'ఫేక్ న్యూస్'గా కొట్టిపారేశారు. అణు కార్యకలాపాలపై స్పష్టమైన హామీలు ఇస్తే తప్ప ఎలాంటి ఒప్పందం కుదరదని అమెరికా వర్గాలు స్పష్టం చేశాయి. మరోవైపు, ఎంతటి ఆర్థిక ఒత్తిళ్లు తెచ్చినా ఇరాన్ దేనికీ లొంగబోదని ఐఆర్‌జీసీ (IRGC) ప్రతినిధి సర్దార్ హుస్సేన్ మొహబ్బి తేల్చిచెప్పారు.

# భారతీయ ఇన్వెస్టర్లకు అమెరికా షాక్




ఈబీ-5 వీసా దరఖాస్తు రుసుములు భారీగా పెంపు..
నవంబర్ 30 నుంచి అమలు

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికాలో పెట్టుబడులు పెట్టి గ్రీన్‌కార్డ్ పొందాలనుకునే విదేశీ ఇన్వెస్టర్లకు ట్రంప్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ కింద దరఖాస్తు రుసుములను భారీగా పెంచుతూ అమెరికా సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) నిర్ణయించింది. పెంచిన రుసుములు నవంబర్ 30 నుంచి అమల్లోకి రానున్నాయి.

కొత్త నిబంధనల ప్రకారం ఐ-526 ఫామ్ రుసుము 3,675 డాలర్ల నుంచి 7,615 డాలర్లకు, ఐ-526ఈ ఫీజు 3,675 డాలర్ల నుంచి 7,850 డాలర్లకు పెరగనుంది. ఐ-526ఈకి అదనంగా 75 డాలర్ల సాంకేతిక రుసుము చెల్లించాలి. శాశ్వత నివాసంపై ఉన్న షరతులను తొలగించేందుకు దాఖలు చేసే ఐ-829 ఫీజు 3,750 నుంచి 5,000 డాలర్లకు పెరుగుతుంది. అలాగే ఐ-956ఎఫ్ రుసుము 17,795 నుంచి ఏకంగా 42,675 డాలర్లకు చేరనుంది.

దరఖాస్తుల పరిశీలన, నేపథ్య తనిఖీలు, అర్హతల ధ్రువీకరణ, మోసాల గుర్తింపు, కార్యక్రమ నిర్వహణ ఖర్చులను భరించేందుకే రుసుములు పెంచినట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

1990లో ప్రారంభమైన ఈబీ-5 కార్యక్రమం ద్వారా విదేశీ పెట్టుబడిదారులు అమెరికా వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టడంతోపాటు కనీసం 10 పూర్తికాల ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. అర్హత సాధించిన పెట్టుబడిదారులతో పాటు వారి జీవిత భాగస్వామి, పిల్లలు కూడా గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ వీసాకు భారతీయుల నుంచి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొత్త రుసుముల పెంపు వారిపై అదనపు ఆర్థిక భారంగా మారనుంది.

# ఈఫిల్ టవర్ వివాదం.. సంస్థ అధిపతి రాజీనామా

## మహిళా ఉద్యోగులను విధుల నుంచి తప్పించడంపై స్వతంత్ర దర్యాప్తు

బలగం టీవీ, న్యూఢిల్లీ



ఫ్రాన్స్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌లో హిందూ మత సంస్థకు చెందిన ప్రతినిధి బృందం పర్యటన సందర్భంగా మహిళా ఉద్యోగులను విధుల నుంచి తప్పించడంపై తలెత్తిన వివాదం సంస్థ అధిపతి వైదొలిగే వరకు వెళ్లింది. ఈఫిల్ టవర్‌ను నిర్వహించే సొసైటీ డి ఎక్స్‌ప్లాయిటేషన్ డి లా టూర్ ఈఫిల్ (ఎస్‌ఈటీఈ) డైరెక్టర్ జనరల్ పాట్రిక్ బ్రాంకో రూవో ఈ ఏడాది చివర్లో పదవి నుంచి తప్పుకోనున్నట్లు సంస్థ ప్రకటించింది.

సెప్టెంబర్ 5న బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్)కు అనుబంధంగా ఉన్న సుమారు 100 మంది ప్రతినిధులు ఈఫిల్ టవర్‌ను సందర్శించారు. పారిస్ సమీపంలో కొత్తగా నిర్మించిన హిందూ దేవాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పర్యటన జరిగింది. బృందం టవర్‌లో పర్యటిస్తున్న సమయంలో మహిళా ఉద్యోగులను తమ పని ప్రదేశాల నుంచి తప్పించి, వారి స్థానాల్లో పురుష ఉద్యోగులను నియమించారని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆరోపించారు.

ఈ ఘటనపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమై సెప్టెంబర్ 7న నిరసన చేపట్టారు. దీంతో ఈఫిల్ టవర్ కొంతకాలం సందర్శకులకు మూసివేయాల్సి వచ్చింది. ఘటనపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించిన ఎస్‌ఈటీఈ.. పర్యటన ఏర్పాట్లలో 'కార్యాచరణపరమైన లోపాలు, వైఫల్యాలు' ఉన్నట్లు గుర్తించింది. మహిళా ఉద్యోగులను తప్పించడం 'ఆమోదయోగ్యం కాని చర్య' అని పేర్కొంది.

బీఏపీఎస్ మాత్రం తమ ప్రతినిధి బృందం పర్యటన ముందస్తుగా నిర్ణయించినదేనని తెలిపింది. పెద్ద సంఖ్యలో బృందం రావడంతో ఇతర సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ప్రారంభ సమయాన్ని ఎంచుకున్నామని పేర్కొంది. తమకు తెలిసినంత వరకు ఎవరినీ ఈఫిల్ టవర్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకోలేదని, అయినప్పటికీ జరిగిన పరిణామాల వల్ల కలిగిన ఇబ్బందులకు క్షమాపణలు చెబుతున్నట్లు వెల్లడించింది.

మరోవైపు, ప్రతినిధి బృందం పర్యటన సందర్భంగా మహిళలతో పరస్పర సంబంధాలను పరిమితం చేసే ఏర్పాట్లు కోరినట్లు ఎస్‌ఈటీఈ గతంలో అంగీకరించింది. ఇలాంటి షరతులను అంగీకరించాల్సింది కాదని సంస్థ అప్పట్లో పేర్కొంది. తాజాగా దర్యాప్తు నివేదిక అనంతరం సంస్థ అధిపతి రూవో పదవి నుంచి వైదొలగనున్నట్లు ప్రకటించారు. అయితే మహిళా ఉద్యోగులను తప్పించాలని రూవో స్వయంగా ఆదేశించారని దర్యాప్తు లేదా సంస్థ పేర్కొనలేదు.

ఎస్‌ఈటీఈ చైర్మన్ ఏరియల్ వెయిల్ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక విభాగం ఏర్పాటు, కొత్త విధివిధానాలు, శిక్షణ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. లింగ సమానత్వాన్ని పరిరక్షించేలా పెద్ద సంఖ్యలో వచ్చే ప్రైవేట్, మతపరమైన బృందాల పర్యటనలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

ఏటా సుమారు 70 లక్షల మంది సందర్శించే ఈఫిల్ టవర్ గతంలోనూ ఉద్యోగుల సమ్మెల కారణంగా మూసివేయబడింది. అయితే ఈసారి మహిళా ఉద్యోగుల పట్ల వ్యవహరించిన తీరుపై వివాదం స్వతంత్ర దర్యాప్తు, తాత్కాలిక మూసివేతతో పాటు సంస్థ నాయకత్వ మార్పునకు దారితీసింది.

# సర్పంచ్ భర్త పెత్తనంపై వార్డు సభ్యుల అసహనం..

## -అధికారిక హోదా లేకపోయినా గ్రామ కార్యక్రమాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు..
## -సర్పంచ్ ఉండగా భర్త పెత్తనం ఎందుకంటూ ప్రశ్నిస్తున్న వార్డు సభ్యులు, గ్రామస్తులు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:




వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామంలో సర్పంచ్ భర్త వ్యవహారశైలిపై కొందరు వార్డు సభ్యులు, గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్‌గా గుర్రపు స్వరూప కొనసాగుతున్నప్పటికీ, ఆమె భర్త గుర్రపు నరేష్ గ్రామంలోని పలు కార్యక్రమాల్లో ముందుండి వ్యవహరిస్తూ పెత్తనం చెలాయిస్తున్నారని కొందరు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు.

మంగళవారం అడవి పదిర గ్రామంలో పోషణ్ అభియాన్–పోషణ్ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, వార్డు సభ్యులు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కూర్చోవాల్సిన ప్రదేశంలో సర్పంచ్ భర్త కూర్చోవడంతో తమకు గౌరవం దక్కలేదని కొందరు వార్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీకి ఎన్నికైన ప్రజాప్రతినిధిగా సర్పంచ్‌కు అధికారిక బాధ్యతలు ఉండగా, సర్పంచ్ భర్త ఏ హోదాలో గ్రామ కార్యక్రమాల్లో అధికారికంగా జోక్యం చేసుకుంటున్నారని వార్డు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

సర్పంచ్ భర్తగా కుటుంబపరంగా సహకరించడం వేరని, కానీ గ్రామ పంచాయతీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల స్థానాన్ని, ప్రోటోకాల్‌ను గౌరవించాల్సిన అవసరం ఉందని వార్డు సభ్యులు పేర్కొంటున్నారు. ఎన్నికైన వార్డు సభ్యులకు తగిన గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం వల్ల తమలో అసంతృప్తి నెలకొందని వారు అంటున్నారు.

ఇదిలా ఉండగా, గ్రామంలో సర్పంచ్ స్థానంలో ఆమె భర్త పెత్తనం కొనసాగుతున్నట్లు కనిపిస్తోందని కొందరు గ్రామస్తులు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌గా గుర్రపు స్వరూప ఉన్నప్పుడు, పంచాయతీ వ్యవహారాల్లో ఆమె భర్త పాత్ర ఎంతవరకు ఉండాలి? అనే ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.

అయితే, ఈ ఆరోపణలపై సర్పంచ్ గుర్రపు స్వరూప లేదా ఆమె భర్త గుర్రపు నరేష్ వివరణ తెలియాల్సి ఉంది. సంబంధిత వ్యక్తుల వివరణ లభిస్తే కథనంలో వారి వాదనను కూడా ప్రచురించాల్సి ఉంటుంది.

గ్రామ పంచాయతీ పాలనలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాత్రకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, కార్యక్రమాల్లో వార్డు సభ్యులకు తగిన గౌరవం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మడుపు తిరుపతిరెడ్డి, వార్డు మెంబర్లు ప్రదీప్, స్వామి, హారిక, అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గువాహటి వన్డేలో భారత్ విధ్వంసం..



## గిల్ డబుల్ సెంచరీ, రోహిత్ రికార్డు శతకంతో వన్డే సిరీస్ సొంతం!

బలగం టీవీ, గువాహటి

గువాహటిలోని బర్సపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా అసాధారణ అద్భుతాన్ని ఆవిష్కరించింది. వెస్టిండీస్ విసిరిన 406 పరుగుల అతి భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు నీరుగార్చారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీకి తోడు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ విధ్వంసక సెంచరీతో విరుచుకుపడటంతో భారత్ 43.3 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన టీమిండియా, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం.

గిల్ చారిత్రాత్మక డబుల్ సెంచరీ.. రికార్డుల మోత: ఈ మ్యాచ్‌తో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన పేరును రికార్డు పుస్తకాల్లో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు. కేవలం 117 బంతుల్లో డబుల్ సెంచరీ బాదిన గిల్, వన్డే చరిత్రలోనే అత్యంత వేగవంతమైన ద్విశతకం సాధించిన బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా వన్డేల్లో రెండు డబుల్ సెంచరీలు చేసిన రెండో భారత బ్యాటర్‌గా రోహిత్ శర్మ సరసన నిలిచాడు. అంతకుముందు 62 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన గిల్, భారత కెప్టెన్‌గా వేగవంతమైన వన్డే శతకం నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో భారత్‌లో వరుసగా మూడు వన్డే సెంచరీలు చేసిన జాబితాలో విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ సరసన స్థానం సంపాదించాడు.

రోహిత్ విశ్వరూపం.. 12 వేల పరుగుల మైలురాయి: మరోవైపు ఓపెనర్ రోహిత్ శర్మ కేవలం 72 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో చెలరేగి వన్డేల్లో తన 35వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో వన్డేల్లో 12 వేల పరుగుల మైలురాయిని దాటిన మూడో భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. 282 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించి అత్యంత వేగంగా 12 వేల రన్స్ పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా (విరాట్ కోహ్లీ తర్వాత) నిలిచాడు. దాంతోపాటు భారత గడ్డపై వన్డేల్లో 200 సిక్సర్లు బాదిన తొలి బ్యాటర్‌గానూ రోహిత్ మరో అరుదైన ఘనత సాధించాడు.

ఛేదనలో రుతురాజ్ అండ.. సిరీస్ కైవసం: తొలి వన్డే సెంచరీ హీరో విరాట్ కోహ్లీ 29 పరుగులకే పెవిలియన్ చేరినా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్ గిల్‌కు కొండంత అండగా నిలిచాడు. వికెట్ పడకుండా కాపాడుకుంటూ గిల్ విధ్వంసానికి సహకరించడంతో టీమిండియా సునాయాసంగా రికార్డు ఛేజింగ్‌ను ముగించింది.

అంతకుముందు వెస్టిండీస్ బ్యాటర్లు చెలరేగిపోయారు. భారత బౌలర్లపై విరుచుకుపడి పరుగుల వరద పారించడంతో విండీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. వన్డేల్లో వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక స్కోరు కాగా, తొలిసారి 400 పరుగుల మార్కును దాటింది. అమీర్ జంగూ (114), షై హోప్ (104), జాన్ క్యాంప్‌బెల్ (101) శతకాలతో అదరగొట్టారు. దీంతో భారత్ ముందు 406 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

ఇంతకుముందు వన్డేల్లో విండీస్ అత్యధిక స్కోరు 389 పరుగులు. 2019లో ఇంగ్లండ్‌పై సెయింట్ జార్జ్‌లో ఆ స్కోరు చేసింది. తాజాగా ఆ రికార్డును విండీస్ అధిగమించింది. క్యాంప్‌బెల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. 68 బంతుల్లో 101 పరుగులు సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. పవర్‌ప్లే ముగిసేసరికి విండీస్ 96/1తో నిలిచింది. కేవలం 65 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన క్యాంప్‌బెల్ 101 పరుగుల వద్ద గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.షై హోప్‌కు రెండుసార్లు క్యాచ్‌లు చేజారడం కలిసొచ్చింది. 15, 27 పరుగుల వద్ద భారత ఫీల్డర్లు అవకాశాలను వదులుకున్నారు. ఆ తర్వాత హోప్ చెలరేగి 94 బంతుల్లో 104 పరుగులు చేశాడు. జంగూ సైతం ధాటిగా బ్యాటింగ్ చేసి 77 బంతుల్లో 114 పరుగులు సాధించాడు. ఒకే వన్డే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేయడం క్రికెట్ చరిత్రలో ఇది ఆరోసారి కాగా, విండీస్ ఈ జాబితాలో చేరింది.భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, గుర్నూర్ బ్రార్ రెండేసి వికెట్లు పడగొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కింది. అరంగేట్రం చేసిన అకీబ్ నబీ 10 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. వన్డే అరంగేట్రంలో భారత బౌలర్ ఇచ్చిన అత్యధిక పరుగులు ఇవే. కుల్దీప్ యాదవ్ 123 మ్యాచ్‌ల్లో 200 వన్డే వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. మహ్మద్ షమీ తర్వాత భారత్ తరఫున అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన బౌలర్‌గా నిలిచాడు. మరోవైపు నమన్ ధీర్ ఆరు ఓవర్లు బౌలింగ్ చేసిన అనంతరం ఎడమ చీలమండకు గాయం కావడంతో మైదానం వీడాడు. చివరి ఐదు ఓవర్లలో విండీస్ 36 పరుగులు జోడించి స్కోరును 400 దాటించింది.



# వన్డేల్లో 12 వేల పరుగుల క్లబ్‌లో రోహిత్ శర్మ..

## మూడో భారతీయుడిగా సరికొత్త మైలురాయి!

బలగం టీవీ, గువాహటి

భారత మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌లో మరో అరుదైన ఘనత సాధించాడు. గువాహటి వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో ధనాధన్ అర్ధశతకంతో మెరిసిన రోహిత్, వన్డే ఫార్మాట్‌లో 12,000 పరుగుల మైలురాయిని విజయవంతంగా చేరుకున్నాడు. తన ఫామ్‌పై వస్తున్న విమర్శలకు బ్యాట్‌తోనే సమాధానమిస్తూ విండీస్ బౌలర్లను ఉతికేసిన హిట్‌మ్యాన్, వ్యక్తిగత స్కోరు 73 వద్ద ఈ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం ద్వారా వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన మూడో భారతీయ బ్యాటర్‌గా రోహిత్ శర్మ రికార్డు నెలకొల్పాడు. అతడి కంటే ముందు క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ మాత్రమే ఈ జాబితాలో ఉన్నారు. రోహిత్ కేవలం 282 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటడం విశేషం. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత వేగంగా 12 వేల పరుగులు పూర్తి చేసిన ప్లేయర్లలో విరాట్ కోహ్లీ (242 ఇన్నింగ్స్‌లు) అగ్రస్థానంలో ఉండగా, రోహిత్ శర్మ రెండో స్థానంలో నిలిచాడు.

క్రికెట్ దిగ్గజాల రికార్డులను అధిగమిస్తూ రోహిత్ శర్మ ఈ ఘనత సాధించడం గమనార్హం. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 12 వేల పరుగులు సాధించడానికి 300 ఇన్నింగ్స్‌లు తీసుకోగా, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 314 ఇన్నింగ్స్‌లు, శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర 336 ఇన్నింగ్స్‌లు తీసుకున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌ను లక్ష్యంగా చేసుకుని బరిలోకి దిగిన రోహిత్ శర్మ, మళ్లీ పాత ఫామ్‌ను అందిపుచ్చుకోవడంతో క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# షూటింగ్ ఆఫ్‌లో భారత్‌కు మరో గోల్డ్!

బలగం టీవీ, ఐచి-నాగోయా (జపాన్):

ఆసియా క్రీడలు 2026లో భారత ఆర్చర్లు సంచలన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. పోటీల 11వ రోజున ఆర్చరీ విభాగంలో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. ఉత్కంఠభరితంగా సాగిన మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఫైనల్ ఈవెంట్‌లో భారత జంట చికితా తానిపర్తి, సాహిల్ జాదవ్ అద్భుత విజయంతో పసిడి పతకాన్ని ముద్దాడారు. దీనికి ముందే మహిళల కాంపౌండ్ విభాగంలో భారత్‌కు మొదటి స్వర్ణం దక్కిన సంగతి తెలిసిందే.

హృదయస్పందన పెంచిన షూట్ ఆఫ్: దక్షిణ కొరియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠగా సాగింది. ప్రారంభం నుంచి స్వల్ప ఆధిక్యంలో ఉన్న భారత జంటపై కొరియన్ క్రీడాకారులు తీవ్ర ఒత్తిడి పెంచారు. చివరి నిమిషంలో కొరియన్ ప్లేయర్లు పార్క్, చోయ్ చెరో 10 పాయింట్లు సాధించడంతో భారత్ స్వర్ణం నిలబెట్టుకోవడానికి పర్ఫెక్ట్ 10 కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ దశలో చికితా 9, సాహిల్ 10 పాయింట్లు సాధించడంతో ఇరు జట్ల స్కోర్లు సమమయ్యాయి.

దీంతో విజేతను నిర్ణయించేందుకు షూట్ ఆఫ్ నిర్వహించారు. అత్యంత ఒత్తిడితో కూడుకున్న ఈ టైబ్రేకర్ దశలో చికితా, సాహిల్ ఇద్దరూ చెరో 10 పాయింట్లు పర్ఫెక్ట్ షాట్స్ కొట్టి ప్రత్యర్థిపై మానసిక విజయం సాధించారు. భారత ఆర్చర్లు పెంచిన ఒత్తిడికి తలవంచిన కొరియా ప్లేయర్ చోయ్ కేవలం 9 పాయింట్లే సాధించడంతో భారత్‌కు విజయం ఖాయమైంది. ఈ చారిత్రక విజయంతో భారత మిక్స్‌డ్ కాంపౌండ్ జంట 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం విశేషం.

# అదరగొట్టిన త్రిమూర్తులు..







## పతకాల హ్యాట్రిక్‌తో సరికొత్త చరిత్ర సృష్టించిన నీరూ, గుల్వీర్, విద్యా!

బలగం టీవీ, ఐచి-నాగోయా (జపాన్):

ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు చారిత్రక ప్రదర్శనతో మెరిశారు. షూటర్ నీరూ ధండా, అథ్లెట్లు గుల్వీర్ సింగ్, విద్యా రామరాజ్ ఒకే ఆసియా గేమ్స్ ఎడిషన్‌లో తలొక మూడు పతకాలు సాధించి భారత క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. షూటింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ ముగ్గురూ చూపిన అద్భుత ప్రతిభతో భారత పతకాల పట్టిక పరుగులు తీసింది.

షూటింగ్‌లో నీరూ ధండా గోల్డెన్ రికార్డ్:

భారత రికార్డు విజయంలో స్టార్ షూటర్ నీరూ ధండా సంచలన ప్రదర్శన చేసింది. ఆషీమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కలిసి మహిళల ట్రాప్ టీమ్ విభాగంలో రజతం సాధించడంతో నీరూ పతకాల వేట ప్రారంభమైంది. ఆ తర్వాత మహిళల వ్యక్తిగత ట్రాప్‌లో 28 పాయింట్ల ఆసియా రికార్డుతో స్వర్ణం గెలుచుకుని, ఈ విభాగంలో ఆసియాడ్ పసిడి గెలిచిన తొలి భారత మహిళగా చరిత్రకెక్కింది. అనంతరం క్రైనన్ చెనాయ్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ విభాగంలో రికార్డు స్కోరుతో మరో పసిడిని ముద్దాడి, ఈ గేమ్స్‌లో తన ఖాతాలో రెండు స్వర్ణాలు, ఒక రజతాన్ని జమ చేసుకుంది.

సుదీర్ఘ పరుగులో గుల్వీర్ సింగ్ రికార్డుల వేట:

అథ్లెటిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో గుల్వీర్ సింగ్ సుదీర్ఘ పరుగు పోటీల్లో అద్భుత ఫామ్‌ను ప్రదర్శించాడు. పురుషుల 10,000 మీటర్ల విభాగంలో రజతం సాధించిన అతడు, ఆ తర్వాత 1,500 మీటర్లలో 3:36.72 నిమిషాల వ్యక్తిగత ఉత్తమ సమయంతో మరో రజతాన్ని దక్కించుకున్నాడు. చివరిగా 5,000 మీటర్ల పోటీని 13:32.75 నిమిషాల్లో పూర్తి చేసి కాంస్యం గెలుచుకుని హ్యాట్రిక్ పూర్తి చేశాడు. 1951 తొలి ఆసియా గేమ్స్‌లో లావీ పింటో తర్వాత ఒకే ఆసియాడ్‌లో మూడు వ్యక్తిగత అథ్లెటిక్స్ పతకాలు గెలిచిన రెండో భారత పురుష అథ్లెట్‌గా గుల్వీర్ నిలిచాడు.

మూడు విభిన్న రంగుల పతకాలతో విద్యా రామరాజ్ మెరుపులు:

తమిళనాడుకు చెందిన విద్యా రామరాజ్ ఒకే ఆసియాడ్ ఎడిషన్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మూడూ సాధించి రికార్డు సృష్టించింది. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌ను 54.75 సెకన్లలో పూర్తి చేసి కాంస్యం గెలవడమే కాకుండా పి.టి. ఉష పేరిట ఉన్న 42 ఏళ్ల నాటి జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. అనంతరం 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో రజతం గెలిచిన భారత జట్టులో భాగమైన విద్యా, చివరిగా మహిళల 4x400 మీటర్ల రిలేలో అద్భుతమైన యాంకర్ లెగ్ పరుగుతో భారత్‌కు పసిడి పతకాన్ని అందించింది




# రెజ్లింగ్‌లో సునీల్ కుమార్ చరిత్ర..

## గ్రీకో-రోమన్‌లో భారత్‌కు తొలిసారి డబుల్ మెడల్!

బలగం టీవీ, ఐచి-నాగోయా (జపాన్):

ఆసియా క్రీడలు 2026లో భారత స్టార్ రెజ్లర్ సునీల్ కుమార్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. బుధవారం జరిగిన పురుషుల 87 కేజీల గ్రీకో-రోమన్ కాంస్య పతక పోరులో ఘనవిజయం సాధించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో ఆసియా క్రీడల చరిత్రలోనే గ్రీకో-రోమన్ రెజ్లింగ్ విభాగంలో రెండు పతకాలు సాధించిన ఏకైక భారతీయ క్రీడాకారుడిగా 27 ఏళ్ల సునీల్ కుమార్ రికార్డులకెక్కాడు.

ముగిసిన తొలి పీరియడ్.. 9-0తో ఘనవిజయం: హర్యానాకు చెందిన సునీల్ కుమార్ కాంస్య పతక మ్యాచ్‌లో ఫిలిప్పీన్స్ అథ్లెట్ కల్లమ్ జాన్సన్ రాబర్ట్స్‌పై మొదటి నుంచీ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. బావుటా ఎగురవేస్తూ ప్రత్యర్థి కుడి చేతిని లాక్ చేసి రెండు టేక్‌డౌన్లతో క్షణాల్లో 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా 'పార్ టెర్రే' పొజిషన్‌లోనూ వరుసగా పాయింట్లు సాధించాడు. సునీల్ కుమార్ చూపించిన ధాటికి తొలి పీరియడ్‌లోనే మ్యాచ్ ముగియడంతో పాటు, 9-0 పాయింట్ల తేడాతో 'టెక్నికల్ సుపీరియారిటీ' ద్వారా విజయం లభించింది.

2023 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో కూడా కాంస్యం సాధించిన సునీల్ కుమార్, ఇప్పుడు వరుసగా రెండో ఎడిషన్‌లోనూ పతకం గెలుచుకుని భారత రెజ్లింగ్ ఖ్యాతిని ఖండాంతరాల్లో మరోసారి చాటిచెప్పాడు.

# మహిళల హాకీ ఫైనల్లో భారత్

## 44 ఏళ్ల నిరీక్షణకు తెర..
## దక్షిణ కొరియాపై 2-0 విజయం..
## స్వర్ణం కోసం చైనాతో తలపడనున్న టీమిండియా

బలగం టీవీ, ఐచి-నాగోయా (జపాన్):

ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో దక్షిణ కొరియాను 2-0తో చిత్తు చేసిన భారత్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. దీంతో 44 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల మహిళల హాకీలో స్వర్ణ పతకం సాధించే అవకాశాన్ని సజీవంగా ఉంచుకుంది.

పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో తొలి రౌండ్ నుంచే దూకుడుగా ఆడుతున్న భారత జట్టు సెమీఫైనల్లోనూ అదే జోరు కొనసాగించింది. దక్షిణ కొరియాపై ఆధిపత్యం ప్రదర్శించిన భారత్ రెండో అర్ధభాగంలో రెండు గోల్స్ సాధించింది. 44వ నిమిషంలో ఇషికా చౌదరీ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యం అందించగా.. 48వ నిమిషంలో కెప్టెన్ సలీమా టెటె మరో గోల్ చేసి ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. అనంతరం కొరియా ఎలాంటి గోల్ చేయకుండా భారత రక్షణ శ్రేణి అడ్డుకుంది.

1982లో ఢిల్లీ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో చివరిసారిగా భారత మహిళల హాకీ జట్టు స్వర్ణ పతకం సాధించింది. ఆ తర్వాత మళ్లీ పసిడి పతకం కోసం ఫైనల్ చేరిన భారత జట్టు.. డిఫెండింగ్ ఛాంపియన్ చైనాతో తలపడనుంది.





# ఐఎఫ్ఏ షీల్డ్ సెమీస్‌కు పంజాబ్ ఎఫ్‌సీ

## ఈస్ట్ బెంగాల్‌పై 1-0 విజయం.. అక్టోబర్ 2న నార్త్ఈస్ట్ యునైటెడ్‌తో సెమీఫైనల్

బలగం టీవీ, హైదరాబాద్

ఐఎఫ్ఏ షీల్డ్ 2026-27లో పంజాబ్ ఎఫ్‌సీ సెమీఫైనల్‌కు చేరుకుంది. బుధవారం ఈస్ట్ బెంగాల్ మైదానంలో జరిగిన గ్రూప్-2 చివరి మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీపై 1-0తో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసిన పంజాబ్ ఎఫ్‌సీ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది.

కొత్తగా జట్టులో చేరిన బ్రెజిల్ ఆటగాడు డియాగో రపోసో తొలి అర్ధభాగంలో చేసిన గోల్ పంజాబ్ విజయాన్ని ఖరారు చేసింది. ఈస్ట్ బెంగాల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. నాలుగో నిమిషంలో క్రిస్ ఇకోనోమిడిస్ దూరం నుంచి కొట్టిన బంతి పంజాబ్ గోల్‌కీపర్ అర్షదీప్ సింగ్‌ను దాటి వెళ్లేలా ప్రయత్నించినా లక్ష్యాన్ని చేరలేదు.20వ నిమిషంలో పంజాబ్‌కు తొలి కీలక అవకాశం లభించింది. బాక్స్‌లో రాఫెల్ మెస్సీ బౌలీ చేసిన ప్రయత్నాన్ని ఈస్ట్ బెంగాల్ గోల్‌కీపర్ పుర్బా లాచెన్పా అడ్డుకున్నాడు. అనంతరం బిషు శర్మ కొట్టిన బంతి సైడ్ నెట్‌ను తాకింది. మరోవైపు ఇకోనోమిడిస్ పంపిన క్రాస్‌ను రోహిత్ దాను హెడర్‌తో గోల్‌గా మలిచే ప్రయత్నం చేసినా బంతి బార్ పై నుంచి వెళ్లింది.సెమీఫైనల్లో పంజాబ్ ఎఫ్‌సీ అక్టోబర్ 2న నార్త్ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీతో తలపడనుంది.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు 60 పతకాలు

## 10 స్వర్ణాలు, 21 రజతాలు, 29 కాంస్యాలతో పతకాల పట్టికలో 8వ స్థానం

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల్లో 11వ రోజు ముగిసే సమయానికి భారత్ మొత్తం 60 పతకాలు సాధించింది. ఇందులో 10 స్వర్ణాలు, 21 రజతాలు, 29 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ 8వ స్థానంలో కొనసాగుతోంది.

చైనా 150 స్వర్ణాలు, 66 రజతాలు, 59 కాంస్యాలతో మొత్తం 275 పతకాలతో అగ్రస్థానంలో ఉంది. జపాన్ 49 స్వర్ణాలు, 76 రజతాలు, 73 కాంస్యాలతో 199 పతకాలతో రెండో స్థానంలో ఉండగా, దక్షిణ కొరియా 24 స్వర్ణాలు, 30 రజతాలు, 48 కాంస్యాలతో 102 పతకాలతో మూడో స్థానంలో ఉంది.

ఉజ్బెకిస్థాన్ 16 స్వర్ణాలు, 19 రజతాలు, 19 కాంస్యాలతో 54 పతకాలతో నాలుగో స్థానంలో ఉండగా, థాయ్‌లాండ్ 12 స్వర్ణాలు, 10 రజతాలు, 12 కాంస్యాలతో 34 పతకాలతో ఐదో స్థానంలో ఉంది. ఇరాన్ 39 పతకాలతో ఆరో స్థానంలో, బహ్రెయిన్ 21 పతకాలతో ఏడో స్థానంలో ఉన్నాయి.

భారత్ తర్వాత కజకిస్థాన్ 56 పతకాలతో తొమ్మిదో స్థానంలో, ఉత్తర కొరియా 20 పతకాలతో పదో స్థానంలో కొనసాగుతున్నాయి.





# వన్డేల్లో కుల్దీప్ యాదవ్ సరికొత్త చరిత్ర..

## అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన భారత స్పిన్నర్‌గా రికార్డు!

బలగం టీవీ, గువాహటి

టీమిండియా చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ వన్డే క్రికెట్‌లో అరుదైన మైలురాయిని అధిరోహించాడు. వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో రాణించిన కుల్దీప్, వన్డే ఫార్మాట్‌లో 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు. తద్వారా భారత్ తరఫున అత్యంత వేగంగా 200 వన్డే వికెట్లు పడగొట్టిన తొలి స్పిన్నర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. విండీస్ బ్యాటర్లు షై హోప్, కీమో పాల్‌లను అవుట్ చేయడం ద్వారా అతడు ఈ ఘనత సాధించాడు.

స్పిన్నర్లలో నంబర్ 1.. ఓవరాల్‌గా రెండో స్థానం: కుల్దీప్ యాదవ్ కేవలం 123 వన్డేల్లోనే 26.70 సగటుతో 200 వికెట్ల మైలురాయిని అందుకోవడం విశేషం. భారత్ తరఫున ఓవరాల్‌గా అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన బౌలర్ల జాబితాలో పేసర్ మహమ్మద్ షమీ (104 వన్డేలు) అగ్రస్థానంలో ఉండగా, కుల్దీప్ యాదవ్ రెండో స్థానంలో నిలిచాడు. దిగ్గజ బౌలర్లు అజిత్ అగార్కర్ (133 వన్డేలు), జహీర్ ఖాన్ (144 వన్డేలు) లతో పోలిస్తే కుల్దీప్ తక్కువ మ్యాచుల్లోనే ఈ మైలురాయిని చేరుకున్నాడు.

తన కెరీర్‌లో ఇప్పటివరకు 123 వన్డేలాడిన కుల్దీప్.. రెండు సార్లు ఐదు వికెట్ల ఘనతను (5-wicket hauls), 10 సార్లు నాలుగు వికెట్ల ప్రదర్శనలను నమోదు చేశాడు. వన్డేల్లో అతడి అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 6/25 కావడం గమనార్హం.

# రాఘవేంద్రరావు చమత్కారం..

## తారక్ రియాక్షన్ వైరల్!



ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. అక్టోబర్ 2న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తారక్ రాకతో ఈవెంట్‌లో అభిమానుల సందడి మరింత పెరగగా.. దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు చేసిన సరదా వ్యాఖ్యలు మాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శశాంక్ ఏలేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌ను ఎస్.ఎస్. రాజమౌళి సమర్పిస్తున్నారు. ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి.వేదికపైకి వచ్చిన కె. రాఘవేంద్రరావు తన ప్రసంగాన్ని 'జై ఎన్టీఆర్' అంటూ ప్రారంభించడంతో అభిమానులు ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. అయితే వెంటనే ఆయన తన మాటలకు కాస్త ఫన్ అందించారు. తాను చెప్పిన 'జై ఎన్టీఆర్' అక్కడ కూర్చున్న జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశించి కాదని, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావును ఉద్దేశించిందేనని స్పష్టం చేస్తూ నవ్వులు పూయించారు. ఆ తర్వాత నందమూరి కుటుంబంలోని తరాలను ప్రస్తావిస్తూ తనదైన శైలిలో చమత్కరించారు. నందమూరి తారక రామారావు తర్వాత ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ, ఆ తర్వాత ఆయన కుమారుడు జూనియర్ ఎన్టీఆర్ అంటూ రాఘవేంద్రరావు చెప్పుకొచ్చారు. చివరగా తారక్‌ను 'జెన్‌జీ ఎన్టీఆర్' అంటూ సరదాగా సంబోధించడంతో సభలో నవ్వులు పూశాయి.దర్శకేంద్రుడి మాటలు వింటూ జూనియర్ ఎన్టీఆర్ చిరునవ్వులు చిందించాడు. పక్కనే ఉన్న ఎస్.ఎస్. రాజమౌళి కూడా నవ్వుతూ కనిపించారు. రాఘవేంద్రరావుకు, ఎన్టీఆర్ కుటుంబానికి ఉన్న అనుబంధం నేపథ్యంలో సాగిన ఈ సరదా సంభాషణ అక్కడున్న వారిని ఆకట్టుకుంది.రాఘవేంద్రరావు చేసిన వ్యాఖ్యల కంటే ఆయన మాటలకు తారక్ ఇచ్చిన స్పందనే ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చకు వస్తోంది. ఎలాంటి అసహనం లేకుండా నవ్వుతూ తారక్ ఆ సందర్భాన్ని స్వీకరించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దర్శకేంద్రుడితో తారక్‌కు ఉన్న సాన్నిహిత్యం ఈ సందర్భంలో మరోసారి కనిపించిందంటూ పలువురు నెటిజన్లు స్పందిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ ఎన్టీఆర్‌ను ప్రస్తావించిన సమయంలో తారక్ చూపించిన గౌరవం కూడా అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

# ఓటీటీకి 'పూజా మేరీ జాన్'




ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఒక వైపున క్రైమ్ థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కథలు దూసుకుపోతుంటే, మరో వైపున కోర్టు రూమ్ డ్రామాలు తమ జోరును కొనసాగిస్తున్నాయి. క్రైమ్ ను .. సస్పెన్స్ ను టచ్ చేస్తూ కోర్టు రూమ్ డ్రామాలు ఉండటం ఈ కాన్సెప్ట్ లకు కలిసొస్తుంది. బలమైన కథ .. కథనం కలిగిన కంటెంట్ కి ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. నిడివి ఎక్కువగా ఉన్నప్పటికీ వాళ్లు ఈ తరహా కంటెంట్ పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. స్త్రీ ప్రధానమైన పాత్రలతో ఈ తరహా కంటెంట్ రూపొందుతుండటం ప్రత్యేకంగా కనిపిస్తోంది. అలా స్త్రీ ప్రధానమైన రెండు పాత్రల చుట్టూ తిరిగే కథలో ఒక సినిమా రూపొందింది. ఆ సినిమా పేరే 'పూజా మేరీ జాన్'. అక్టోబర్ 2వ తేదీ నుంచి 'జీ 5'లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ సినిమాలో పూజ పాత్రను మృణాళ్ ఠాకూర్ పోషించారు. ఈ పాత్ర ను కేంద్రబిందువుగా చేసుకునే ఈ కథ నడుస్తుంది. తన స్నేహితుడు చేసిన లవ్ ప్రపోజల్ ను ఆమె సున్నితంగా తిరస్కరిస్తుంది. ఫలితంగా ఆమె ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనే అంశం చుట్టూ సన్నివేశాలను అల్లుకుంటూ వెళ్లారు. ఇక ఇటీవల కాలంలో ఓటీటీ సినిమాలతో .. సిరీస్ లతో హుమా ఖురేషి ఆడియన్స్ కి మరింత చేరువయ్యారు. అలాంటి ఆమె ఈ సినిమాలో లాయర్ 'సనా' పాత్రను పోషించారు. పూజకి న్యాయం చేయడం కోసం పోరాడే ఒక ధైర్యవంతురాలైన లాయర్ గా ఆమె ఈ పాత్రలో కనిపించనున్నారు. ఈ రెండు పాత్రలు ఈ సినిమాకి రెండు కళ్లుగా చెప్పుకోవలసి ఉంటుంది. నవజోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఓటీటీ ఆడియన్స్ వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ ను రాబట్టుకుంటుందనేది చూడాలి.

# థియేటర్లలో తమన్నా కోసం ఛఠ్ పూజ..



బాలీవుడ్ నటులు సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటించిన 'ది వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' చిత్రం ప్రదర్శితమవుతున్న థియేటర్లలో ప్రస్తుతం ఒక అరుదైన, ఆసక్తికరమైన దృశ్యం ఆవిష్కృతమవుతోంది. ముఖ్యంగా బీహార్, దాని పరిసర ప్రాంతాల్లోని ప్రేక్షకులు సినిమా హాళ్లను ఛఠ్ పూజ వేడుకలకు వేదికలుగా మార్చేస్తున్నారు. ఈ చిత్రంలో బీహార్ ప్రజల అతిపెద్ద పండుగైన ఛఠ్ పూజ నేపథ్యంలో కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. అంతేకాకుండా, 'బీహార్ కోకిల'గా ప్రసిద్ధి చెందిన దివంగత గాయని శారదా సిన్హా ఆలపించిన సుప్రసిద్ధ 'ఛఠీ మైయా' భక్తిగీతాన్ని ఈ సినిమాలో చేర్చారు. థియేటర్లలో ఈ పాట వస్తున్న సమయంలో ప్రేక్షకులు, ముఖ్యంగా మహిళలు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. ప్రేక్షకులు తమ ఇళ్ల నుంచి 'ఠేకువా' అనే సంప్రదాయ పిండివంటను ప్రసాదంగా తీసుకువచ్చి, ఆ పాట ప్రసారమవుతున్న సమయంలో తోటి ప్రేక్షకులకు పంపిణీ చేస్తున్నారు. కొన్ని థియేటర్లలో ప్రేక్షకులు ఛఠ్ పూజ సమయంలో ధరించే సంప్రదాయ వస్త్రాలతో సినిమాకు హాజరవుతుండటం విశేషం. సినిమా ప్రదర్శనను ఒక పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తూ వారు తమ భక్తిని చాటుకుంటున్నారు. వీటికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# స్టేజ్‌పైనే యాంకర్ సుమ కన్నీళ్లు!





టాలీవుడ్‌లో యాంకర్ సుమ కనకాల గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. దశాబ్దాలుగా తనదైన యాంకరింగ్ శైలితో ప్రేక్షకులను అలరిస్తున్న సుమ.. సినిమా ఈవెంట్లు, ప్రీ రిలీజ్ వేడుకలు, టీవీ షోలు, ప్రమోషనల్ కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. ఎలాంటి ఈవెంట్ అయినా తన మాటతీరుతో, చురుకైన టైమింగ్‌తో, హాస్యంతో నడిపించగల యాంకర్‌గా సుమకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మాతృభాష తెలుగు కాకపోయినా.. తెలుగుపై పట్టు సాధించి అద్భుతంగా మాట్లాడటం ఆమెకు మరో ప్రత్యేకత. సుమ తన కెరీర్‌ను నటిగా ప్రారంభించారు. పలు సీరియల్స్‌లో నటించిన ఆమె.. 'వేయిపడగలు' సీరియల్‌తో ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత యాంకరింగ్ వైపు అడుగులు వేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. చిన్న సినిమాల నుంచి స్టార్ హీరోల సినిమా వరకు దాదాపు అన్ని రకాల సినిమా ఈవెంట్లకు యాంకరింగ్ చేస్తూ వచ్చారు. టెలివిజన్ షోలతో పాటు సినిమా ప్రమోషన్లలోనూ సుమ పేరు ఒక బ్రాండ్‌గా మారిపోయింది. ఇలాంటి సుదీర్ఘ ప్రయాణం సాగించిన సుమకు తాజాగా స్టార్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి, గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కలిసి ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఈ ప్రత్యేకమైన సంఘటన చోటుచేసుకుంది. సాధారణంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లలో హీరోలు, హీరోయిన్లు లేదా దర్శకుల గురించి ప్రత్యేకంగా ఏవీలు ప్రదర్శిస్తుంటారు. అయితే ఈసారి రాజమౌళి మాత్రం అందుకు భిన్నంగా యాంకర్ సుమ కోసం ప్రత్యేకంగా ఒక ఏవీని సిద్ధం చేయించారు. స్టేజ్‌పైకి వచ్చిన రాజమౌళి.. ప్రీ రిలీజ్ ఈవెంట్లకు అసలైన హీరో సుమ అంటూ ఆమెను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం సుమ 25 ఏళ్ల యాంకరింగ్ ప్రయాణాన్ని గుర్తు చేస్తూ రూపొందించిన ప్రత్యేక ఏవీని ప్లే చేయించారు. ఈ ఏవీలో సుమ సినీ ప్రయాణంలోని అనేక ఆసక్తికరమైన ఘట్టాలను చూపించారు. ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్, ఎస్.ఎస్. రాజమౌళితో ఆమె చేసిన ఇంటర్వ్యూలకు సంబంధించిన పలు సన్నివేశాలను ఇందులో పొందుపరిచారు. 'స్టూడెంట్ నంబర్ 1' సినిమా నుంచి ప్రారంభమైన సుమ ఫిల్మ్ యాంకరింగ్ ప్రయాణానికి సంబంధించిన జ్ఞాపకాలను కూడా ఈ ఏవీలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బాహుబలి' ప్రమోషన్స్‌తో పాటు 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్స్‌లో సుమ పాల్గొన్న సందర్భాలను కూడా ఇందులో చూపించారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ 'బిగ్‌బాస్ తెలుగు' మొదటి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన సమయంలో సుమతో జరిగిన సంభాషణలకు సంబంధించిన క్లిప్స్‌ను కూడా ఏవీలో జత చేశారు. ఈ స్పెషల్ ఏవీలో జూనియర్ ఎన్టీఆర్ గతంలో సుమ గురించి చేసిన ఓ ఆసక్తికర కామెంట్ కూడా హైలైట్‌గా నిలిచింది. సుమ సినిమాల్లో నటిస్తే ఎలాంటి పాత్రలు ఎంచుకుంటారనే విషయంపై ఎన్టీఆర్ సరదాగా చేసిన వ్యాఖ్యలను కూడా ఇందులో చూపించారు. దీంతో ఏవీ చూస్తున్న సమయంలో ప్రేక్షకులు, ఈవెంట్‌కు హాజరైన సినీ ప్రముఖులు నవ్వుకున్నారు. అదే సమయంలో సుమతో రాజమౌళి చేసిన పలు ఇంటర్వ్యూలకు సంబంధించిన క్లిప్స్‌ను కూడా ఏవీలో ప్రదర్శించారు. సుమతో రాజమౌళికి ఉన్న సుదీర్ఘ పరిచయం, ఆమె యాంకరింగ్‌పై ఆయన గతంలో వ్యక్తం చేసిన ప్రశంసలను కూడా ఇందులో చూపించడం విశేషం. తన 25 ఏళ్ల ప్రయాణానికి సంబంధించిన అరుదైన జ్ఞాపకాలను ఒక్కసారిగా తెరపై చూసిన సుమ భావోద్వేగానికి గురయ్యారు. ఏవీ పూర్తయ్యే సమయానికి ఆమె కళ్లలో నీళ్లు కనిపించాయి. స్టేజ్‌పైనే ఎమోషనల్ అయ్యారు. తన గురించి ఇంత ప్రత్యేకంగా ఏవీ రూపొందిస్తారని ఊహించలేదని సుమ పేర్కొన్నారు. సాధారణంగా ఇతరుల గురించి ఏవీ ప్లే చేసినప్పుడు వారి గురించి మాట్లాడటం సులభంగా ఉంటుందని, కానీ తన గురించి ఇలాంటి ఏవీ ప్లే చేయడంతో ఏం మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని సుమ భావోద్వేగంతో చెప్పారు. ఇంత మంచి ఏవీని రూపొందించిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న 'ది ప్యారడైజ్' టీమ్!



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని టాలీవుడ్ నేచురల్ స్టార్ నానితో పాటు 'ది ప్యారడైజ్' చిత్ర యూనిట్ దర్శించుకున్నారు. సినిమా సక్సెస్ కావడంతో పాటు, ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనకు కృతజ్ఞతగా టీమ్ అంతా కలిసి విజయవాడకు పయనమయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామా ఇటీవల భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన మొదటి రోజు నుంచి బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. తొలి రోజే రూ.80 కోట్లకు పైగా వసూలు చేసి నాని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా 'ది ప్యారడైజ్' సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఈ సినిమా రూ.200 కోట్ల క్లబ్ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ చేరుకున్న నానికి ఆలయ అధికారులు మరియు వేద పండితులు ఘన స్వాగతం పన్నారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరియు చిత్ర బృందం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు నానికి వేదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు మరియు తీర్థప్రసాదాలను బహూకరించారు. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయకిగా నటించగా, మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు తదితరులు కీలక పాత్రల్లో తమ నటనతో ప్రేక్షకులను అలరించారు.

# ఎత్తర ఎత్తు.. పిడికిలి ఎత్తు



ఎమోషన్స్, పీరియడ్ ఎలిమెంట్స్ మేళవింపుగా రూపొందుతున్న చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. శ్రీవిష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈచిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శకుడు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మాతలు. కోన వెంకట్ సమర్పకుడు. అక్టోబర్ 9న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'ఎత్తర ఎత్తు..' సాంగ్‌ని మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి పాటను విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. 'మోచేతీ నీళ్లతోటి ఏ దప్పిక తీరదంట.. బుసకొట్టిన పాము మీద చీమలు దండెత్తెనంట..రాసుకుంటె అగ్గిరవ్వ అడివంతా బూడిదంట.. మనదేమో మురికివాడ.. ఆడిది అద్దాలమేడ.. మన నెత్తురు తాగినాది ఆడింటి ఇటుక పెడ్డ.. చల్.. ఎత్తర ఎత్తు.. పిడికిలి ఎత్తు.. ఎత్తర ఎత్తు గునపం ఎత్తు..' అంటూ విప్లవాత్మక ధోరణిలో భాస్కరభట్ల రాసిన ఈ పాటను విజయ్ బుల్గానిన్ స్వరపరచగా, నల్గొండ గద్దర్ నర్సన్న తనదైన ధోరణిలో ఆలపించారు.ఈ పాటలో శ్రీవిష్ణు పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. రాధిక శరత్‌కుమార్, షైన్‌టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలకపాత్రలు పోషించిన ఈచిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్.